మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



రథయాత్రలో పాల్గొన్న ఎంపి డికె అరుణ

## అంగరంగ వైభవంగా

# స్వామి రథయాత్ర

**రథయాత్రలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్న**

**పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణ**

**నారాయణపేట టౌన్, సెప్టెంబరు 21 ప్రభాతవార్త :** దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి, భవాని మాత బ్రహ్మోత్సవాలు యానగుంది సూర్య నంది క్షేత్రంపై సోమవారం నుంచి ప్రారంభమవు తున్న సందర్భంగా నిర్వాహకులు ఏవి మందార బండి శివరాం రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం అమావాస్య సందర్భంగా శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి వెండి రథం శ్రీశ్రీశ్రీ వీర ధర్మజ మాత చిత్రపట రథాన్ని విజయ సాయి కాలనీలోని ఏవి మందార నివాసం నుండి రథయాత్ర ప్రారంభ మయింది. వేడుకల్లో భాగంగా పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణ యాత్రలో పాల్గొని హారతిచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం పాత బస్టాండ్ సుభాష్ రోడ్ మధ్యలబీడ్, దామరగిద్ద, గడి ముస్కన్ పల్లి, కాన్కుర్తి మీదుగా సూర్య నంది క్షేత్రానికి చేరుకుంది. రథ యాత్రలో భక్తులు, సూర్యనంది క్షేత్రం ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



శ్రీ కురుమూర్తి స్వామి దర్శించుకుంటున్న భక్తులు

## శ్రీకురుమన్న కొండకు

# పోటెత్తిన భక్తజనం

**చిన్నచింతకుంట, సెప్టెంబరు 21 ప్రభాతవార్త :** పల్లె ప్రజల ఆరాధ్య దైవంగా, పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీ కురుమూర్తి స్వామి కొండ కు భక్తులు పోటెత్తారు. ఆదివారం అమావాస్య కావడంతో జిల్లా నలు మూలల నుంచే కాకుండా పల్లె ప్రాంతాల నుంచి ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు, కాలినడకన భక్తులు శ్రీ కురుమూర్తి స్వామి కొండకు ఉదయాన్నే చేరుకున్నారు. కొండ దిగువ నుంచి స్వామివారి సన్నిధి వరకు ఉన్న ప్రధాన మెట్లపై బారులు తీరి స్వామివారిని దర్శించుకునేందుకు పోటీపడ్డారు. శ్రీ కురుమూర్తి స్వామిని కన్నులారా వీక్షించి భక్తులు పునీతులయ్యారు. భక్తుల గోవింద నామస్మరణతో శ్రీ కురుమూర్తి కొండలు పులకరించాయి. ఉద్దాలమండపంలోని శ్రీ స్వామివారి పాదుకలను తాకి భక్తులు పరవశించిపోయారు. కొండ దిగువన జాతర మైదానం భక్తులతో కిటకిటలాడింది. రాజగోపురం ముందు దీపాలు వెలిగించి స్వామి వారిని స్మరించుకున్నారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం, పోలీసులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. రంగు మారిన కోనేరు నీటిలోనే స్నానాలు చేసినట్టు భక్తులు ఆరోపించారు.



## ఊరెళ్తున్నారా..

# జరభద్రం

- కొత్తవారి కదలికలపై సమాచారం అందించాలి
- కాలనీల్లో, ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు శ్రేయస్కరం : జిల్లా ఎస్పీ రావుల గిరిధర్

**వనపర్తి క్రైమ్, సెప్టెంబరు 21 ప్రభాతవార్త:** దసరా పండుగ పిల్లలకు సెలవులుండటంతో చాలా మంది ప్రయాణాలు చేస్తారు. ఇదే అదనుగా దొంగలు చేతివాటం ప్రదర్శిస్తారని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఊళ్లకు వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలని, ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. దసరా పండుగ దృష్ట్యా చోరీల నియంత్రణకు పోలీసులు అన్ని చర్యలు చేపట్టి ప్రజలను అప్రమత్తం చేస్తున్నామన్నారు. రాత్రివేళల్లో వీధుల్లో ముమ్మరంగా గస్తీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ విషయంలో ప్రజలు కూడా జాగ్రత్తలు తీసుకోవాలి. దసరాకి ఊరెళ్లే – మిగతా4లో..

## 32ద్విచక్ర వాహనాలు..

# మూడు ఆటోలు స్వాధీనం

- 300ఇండ్లల్లో తనిఖీలు..
- మహబూబ్‌నగర్‌లో కార్డన్ సెర్చ్
- ప్రజల భద్రత మా బాధ్యత : డీఎస్పీ వెంకటేశ్వర్లు



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

**మహబూబ్‌నగర్ క్రైం, సెప్టెంబరు 21 ప్రభాతవార్త:** జిల్లా ఎస్పీ డి. జానకి ఆదేశాల మేరకు ఆదివారం మహబూబ్ నగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రేమ్ నగర్ ప్రాంతంలో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా విస్తృతమైన కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా 300ఇండ్లను సందర్శించి.. –మిగతా4లో..

# ప్రజలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు

**నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**



కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త:** పూలను పూజించి ప్రకృతిని ఆరాధించే బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీక అని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా ప్రజలందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజలందరూ కుటుంబ సమేతంగా ఆనందోత్సవాల మధ్య బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. బతుకమ్మ పండుగ స్త్రీ శక్తిని ప్రతిబింభించే పండుగగా నిలుస్తుందని కలెక్టర్ తెలిపారు. బతుకమ్మలు నిమ్మజ్జనంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. జిల్లాలో ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో, సోదరభావంతో బతుకమ్మ పండుగను దిగ్విజయంగా జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆకాంక్షించారు.

## ఆల్మట్టి ఎత్తుపెంచితే..

# పాలమూరు ఎడారే



మాట్లాడుతున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, చిత్రంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు

- కర్ణాటక జల దోపిడిని అడ్డుకుందాం..
- కృష్ణానదిపై ప్రాజెక్టుల భవితవ్యం ప్రశ్నార్థకం
- సాగు, తాగునీరు కూడా అందదు..
- పార్టీలకు అతీతంగా అంతా కలిసి ఉద్యమిద్దాం..
- బీఆర్ఎస్ హయాంలోనే పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చాం..
- మీడియా సమావేశంలో మాజీ మంత్రులు లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్
- పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల, చిట్టెం, అంజయ్య, నరేందర్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు21, ప్రభాతవార్త :** కర్ణాటక జలదోపిడితో పాలమూరు ఎడారిగా మారుతుందని, కృష్ణానదిపై ఉన్న ప్రాజెక్టుల భవిష్యత్తే ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, అంజయ్య యాదవ్, చిట్టెం రామ్మోహన్ రెడ్డి, నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆల్మట్టి ఎత్తు పెంచితే సాగు నీళ్ల కాదు, తాగడానికి నీళ్లు కూడా ఉండవని ఆందోళన వ్యక్తం చేశార. పార్టీలకు అతీతంగా అందరం కలిసికట్టుగా పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లయిందని ఇప్పటివరకు ఏ ఒక్క పని చేయలేదన్నారు. కాంగ్రెస్ 2004 నుంచి 2014 వరకు రాష్ట్రాన్ని పాలించింది.. గతంలో యాభై ఏండ్లు అధికారంలో ఉన్నది కాంగ్రెస్ పార్టేనని, అప్పుడు కనీస మౌలిక వసతులు కూడా కల్పించలేదని, తాగునీరు కూడా ఇవ్వలేదని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ హయాంలో ఏర్పాటు చేసిన మిషన్ భగీరథను కనీసం మెయింటేన్ చేయడం చేత కావడం లేదన్నారు. కాంగ్రెస్, టీడీపీలు మహబూబ్‌నగర్ జిల్లాకు వలస జిల్లా అని, పెండింగ్ ప్రాజెక్టులు అనే లాగా చేశారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తరువాత రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చామని, పాలమూరు ప్రాజెక్టు 90శాతం పనులు పూర్తి అయ్యాయని, రెండేళ్లగా పనులు పెండింగ్ పెట్టారని చెప్పారు. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం తొందరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పాలమూరు ప్రాజెక్టును మొత్తం పడావు పెట్టేలా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాలమూరు ప్రాజెక్టు పూర్తి చేయాలని ఉద్యమం చేపట్టాలని నిర్ణయించామన్నారు. ప్రాజెక్టుల పూర్తికి, పథకాల అమలుకు ప్రభుత్వానికి టైం ఇచ్చామని, పండుగ తరువాత కార్యచరణ ప్రారంభిస్తామన్నారు. నార్లాపూర్ వద్ద బిఆర్ఎస్ హయాంలో ఒక పంప్ స్టార్ట్ చేశామని, కరివెన వరకు నీళ్లు తీసుకొని రావచ్చని ప్రాజక్టును పడావు పెడుతున్నారని ఆరోపించారు. రైతులకు యూరియా ఇచ్చే పరిస్థితి లేదు. ఇప్పటికే పంట నష్టపోయే పరిస్థితి వచ్చింది. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి కేవలం 16 నెలలే ఉన్నాడని, ఆరు నెలలు ఢిల్లీలో, ఇతర రాష్ట్రాల్లో ఉన్నాడని సెటైర్ వేశారు. ప్రజలు కాంగ్రెస్కు బుద్ధి చెప్పేందుకు సిద్ధం అయ్యారని తెలిపారు.

**అంతా ఏకం కావాలి**

**మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్**

ఆల్మట్టి 100టిఎంసీల సామర్థ్యం పెంచుకునేందుకు ఎత్తు పెంచేందుకు ప్రణాళికలు రూపొందిస్తుందని పార్టీలకు అతీతంగా పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. పాలమూరు రంగారెడ్డి జిల్లాకు జాతీయ హోదా ఇస్తామని, ప్రధాని మోడీ, సుష్మాస్వరాజ్ తెలిపారని జాతీయ హోదా ఇవ్వకపోగా పైన ఉన్న ప్రాజెక్టులకు ఎత్తు పెంచే ప్రయత్నాలు చేస్తే పాలమూరు ఆగం అవుతుందన్నారు. ఇన్ని ప్రాజెక్టులు, రిజర్వాయర్‌లు కట్టుకున్నాక పైనుంచి నీళ్లు రాకుంటే ఏం చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. ఒకిరిపై ఒకరు విమర్శలు చేసుకోవడ సరైన పద్ధతి కాదన్నారు యూరియా కొరత కూడా ఎందుకు ఏర్పడిందో తెలుపాలన్నారు.



శ్రీశైలం ప్రాజెక్టు 10గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు

# కృష్ణమ్మకు వరద ఉధృతి

- శ్రీశైలం డ్యాం 10గేట్లు ఎత్తి సాగర్‌కు నీటివిడుదల
- 883.90 అడుగులకు చేరుకున్న నీటిమట్టం
- జూరాలకు రెండు లక్షల ఇన్‌ఫ్లో
- 29గేట్లు ద్వారా దిగువకు..

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** కృష్ణమ్మకు వరద ఉధృతి పెరుగుతున్నది. కృష్ణానదిపై ఉన్న ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. శ్రీశైలం డ్యాం నిండుకుండలా మారింది. వరద క్రమంగా పెరుగుతూ వస్తున్నది. ఆదివారం సాయంత్రం 6గంటల సమాచారం మేరకు డ్యాం నీటిమట్టం 885అడుగులకు గాను 883.90అడుగులకు చేరింది. డ్యాం సామర్థ్యం 215.8070టీఎంసీలకు 209.5948టీఎంసీలకు చేరింది. జలాశయానికి జూరాల పవర్‌హౌజ్ ద్వారా 29,555క్యూసెక్కులు, స్పిల్‌వే ద్వారా 2,02,739 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 4479క్యూసెక్కులు, హంద్రీ నుంచి 250క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నది. శ్రీశైలం జలాశయంలోని ఎడమ, కుడి విద్యుదుత్పత్తి కేంద్రాలకు 65,626క్యూసెక్కులు విడుదల చేశారు. డ్యాం 10గేట్లు 10అడుగులు ఎత్తి 2,75,700క్యూసెక్కుల వరద – మిగతా4లో..

# ఒకటి కాదు..రెండు..!

## పాలమూరులో మరో చిరుత కలకలం..

- తిరుమల దేవుని గుట్ట ప్రాంతంలో సంచారం..
- భయాందోళనలో స్థానికులు..
- ముందే చెప్పిన స్థానికులు..లైట్ తీసుకున్న అధికారులు..



**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త:** పాలమూరును చిరుత భయం వెంటాడుతూనే ఉంది. గత వారం అధికారుల బోనులో చిరుత చిక్కడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇక చిరుత భయం లేదని సంతోషపడ్డారు. ఇంతలోనే ఆదివారం ఆ భయాన్ని మళ్లీ మరో చిరుత పరిచయం చేసింది. మహబూబ్నగర్ మున్సిపాలిటీ పరిధిలోని తిరుమల దేవుని గుట్ట ప్రాంతంలోని ఓ బండరాయి పై చిరుత స్థానికులకు కనిపించడం భయాందోళనకు గురి చేస్తున్నది.

**అధికారులకు చెప్పినా..**

గతవారం అధికారులు ముప్పు తిప్పలు పడి వనపర్తి హైదరాబాద్ ఫారెస్ట్ అధికారుల సాయంతో సీసీ కెమెరాలు డ్రోన్లు ఉపయోగించి చిరుతను పట్టుకున్న సంగతి తెలిసిందే. అయితే వీరన్నపేట తిరుమల దేవుని గుట్ట ప్రాంతవాసులు రెండు చిరుతలు ఉన్నాయని ఒకటి చిన్నది ఇంకొకటి కొంత పెద్దగా ఉంది అని అధికారులకు చెప్పారు. ఫారెస్ట్ అధికారులు మాత్రం లేదు ఒక్కటే చిరుత ఉంది అంటూ స్థానికులకు ధైర్యం చెప్పే ప్రయత్నం చేశారు. ఇప్పటికైనా జిల్లా ఫారెస్ట్ అధికారులు, పోలీస్ శాఖ స్పందించి చరితను బంధించి తమకు ప్రాణ రక్షణ కల్పించాలని వేడుకుంటున్నారు.

# క్రీడలకు అత్యంత ప్రాధాన్యత

**అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమంగా రాణించేలా చర్యలు**

**క్రికెట్ కోసం 9 ఎకరాల స్థలం కేటాయింపు**

**వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

**రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె. శివసేనారెడ్డితో కలిసి జిల్లా సెపక్‌తక్రా చాంపియన్‌షిప్ పోటలు ప్రారంభం**

**వనపర్తి ప్రతినిధి, సెప్టెంబరు 21 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని క్రీడాకారులను ప్రోత్సహించి అంతర్జాతీయ స్థాయిలో వారు అత్యుత్తమంగా రాణించేలా చేసేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోదని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి, తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కే శివసేనారెడ్డి అన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్

ఆదివారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న 11వ అంతర్ జిల్లా సీనియర్ మెన్స్ అండ్ ఉమెన్స్ సెపక్ తాక్రా చాంపియన్షిప్ క్రీడా పోటీలకు శివసేన రెడ్డి స్థానిక శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ క్రీడలకు వనపర్తి మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాస గౌడ్ అధ్యక్షత వహించారు. క్రీడలను ప్రారంభించడానికి ముందు ముఖ్య అతిథులు ప్రముఖ క్రీడాకారుడు, హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించి, క్రీడా జ్యోతిని వెలిగించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మహబూబ్ నగర్, ఆదిలాబాద్ జట్ల మధ్య ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ టోర్నమెంట్లో తెలంగాణలోని 10 ఉమ్మడి జిల్లాల వారీగా ఒక్కో జిల్లా నుంచి మెన్స్ ఉమెన్స్ రెండు జట్లు చొప్పున మొత్తం 20 జట్లు పాల్గొననున్నట్లు నిర్వాహకు లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుం దని అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన ఈ రెండేళ్లలో రూ.800 కోట్లు క్రీడలకు కేటాయిం చడం జరిగిందని తెలిపారు. స్థానిక శాసనస భ్యులు మేఘారెడ్డి మాట్లాడుతూ వనపర్తి విద్యా పర్తి మాత్రమే కాదని క్రీడలకు కూడా నిలయ మని అన్నారు. క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి వనపర్తి వారే కావడం, రాష్ట్ర క్రీడా మంత్రి కూడా ఉమ్మడి పాలమూరు జిల్లా వారే కావడం ఎంతో గర్వించదగిన విషయం అన్నారు. సీఎం రేవంత్ కూడా క్రీడల పట్ల చాలా మక్కువ ఉంటుందని, ఇక్కడే చదువుకొని –మిగతా4లో..

## దైవ దర్శనానికి వెళ్తూ..

# కానరాని లోకాలకు..

**ద్విచక్ర వాహనం - ట్రాక్టర్ ఢీ..**

**భర్త మృతి, భార్యకు తీవ్ర గాయాలు**



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన శ్రీనివాసులు

**చిన్నచింతకుంట, సెప్టెంబరు 21 ప్రభాతవార్త :** దైవదర్శనానికి వెళుతూ రోడ్డు ప్రమాదంలో భర్త మృతి, భార్యకు బలమైన గాయాలైన దుర్ఘటన ఆదివారం కౌకుంట్ల మండలం తిరుమలాపూర్ గ్రామ శివారులో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం ఆదివారం అమావాస్య కావడంతో మహబూబ్నగర్ పట్టణం వీరన్న పేటకుకు చెందిన శ్రీనివాసులు (55), ఆయన భార్య నిర్మల కలిసి టీఎస్06 ఈ హెచ్1503 నంబర్ గల ద్విచక్ర వాహనంపై శ్రీ కురుమూర్తి స్వామి దైవదర్శనానికి వస్తుండగా తీర్మలపూర్ గ్రామ శివారులో గూడూరు గ్రామానికి చెందిన మహమ్మద్ రహీం కు చెందిన టీఎస్06 ఎఫ్ హెచ్ 0737 నంబరు గల ట్రాక్టర్ అతివేగంగా అజాగ్రత్తగా వెనుక నుంచి ఢీకొనడంతో శ్రీనివాసులు తల రోడ్డుకు బలంగా తగలడంతో అక్కడికక్కడే మృతిచెందగా, ఆయన భార్య నిర్మల తీవ్రంగా కాలుకు బలమైన గాయాలయ్యాయి. కాగా ఇది గమనించిన స్థానికులు 108 వాహనంలో ఆత్మకూరు ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కు తరలించారు. అమావాస్య రోజున భర్త మృతి భార్యకు బలమైన గాయాలు కావడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

# ఎంగిలిపూల.. వేడుక

- ఉత్సాహంగా బతుకమ్మ సంబురాలు
- ఊరువాడలో మొదలైన పండుగ వాతావరణం
- మార్మోగుతున్న బతుకమ్మ పాటలు, నృత్యాలు

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు21, ప్రభాతవార్త:** పూలనే పూజించే గొప్ప సంస్కృతి ప్రపంచంలో ఎక్కడా లేదు.. ప్రపంచమంతా పూలతో పూజ లు నిర్వహిస్తే మనం పూలను పూజిస్తాం.. ప్రకృతిని ఆరాధించే మహోన్నత వారసత్వానికి ప్రతీక మన బతుకమ్మ పండుగ. తొమ్మిదిరోజు లపాటు సాగే బతుకమ్మ సంబురాలకు ఊరు వాడా సిద్ధమైంది. మొదటి రోజైన అమావాస్య ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను ఉత్సాహం గా నిర్వహించారు.

**పూలను పేర్చి..** బొడ్డెమ్మలు వేసి ప్రత్యేకంగా పూజించారు. ఉదయం నాన బెట్టిన (మిగిలిన వడపప్పు) పెసరపప్పు, దోసకా య ముక్కలు నైవేద్యంగా పెట్టి, పెద్దలకు పెట్ట గా మిగిలింది కనుక ఎంగిలి (వాడిన) పప్పుగా, భోజనాలయ్యాక పేర్చే బతుకమ్మ కనుక దీనిని ఎంగిలి పూల బతుకమ్మ అని ప్రతీతి. తెలంగాణ వైభవాన్ని చాటే తొమ్మిది రోజులు వేడుక ఉత్సాహంగా కొనసాగుతున్నది. కలెక్టర్ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం బతుకమ్మ వేడుకల్లో వివిధశాఖల మహిళాఉద్యోగులు పాల్గొన్నారు. జిల్లా పౌర సరఫరాల శాఖ, ఉపాధి కల్పన శాఖ, డిస్ట్రిక్ట్ ఇన్ఫర్ మెటిక్స్ శాఖ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖ కు చెందిన మహిళా ఉ



ద్యోగులు బతుకమ్మ పాటలకు పాడుతూ బతుకమ్మ ఆడడం జరిగింది రేపు పిల్లల మర్రి లో బతుకమ్మ వేడుకలుమహబూబ్ నగర్ జిల్లా కేంద్రం పిల్లలమర్రిలో సోమవారం జిల్లా యంత్రాంగం తరపున ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. సాయంత్రం 4 గంటలకు వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు పాల్గొంటారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో వివిధ పర్యాటక ప్రదేశాల్లో బతుకమ్మ వేడుకలు నిర్వహించాలని షెడ్యూల్ ప్రకటించి సెప్టెంబర్ 22 న పిల్లల మర్రి పర్యాటకకేంద్రంలో నిర్ణయించినట్లు తెలిపారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబురాలు

# అంధకారంలో రాయచేడ్

### నిధుల కోసం బిక్షాటన చేసి నిరసన తెలిపిన బిజెపి కార్యకర్తలు

**ఉప్పునుంతల, సెప్టెంబరు 21 ప్రభాతవార్త :** మండలంలోని రాయిచేడ్ గ్రామంలో వీధిదీపాలు లేక అంధకారంలో ఉందని, గ్రామపంచాయతీ వారు పట్టించుకోవడం పోవడం లేదని ఆదివారం బిజెపి కార్యకర్తలు మట్టి కుండలను పట్టుకొని భిక్షాటన చేసి నిరసన తెలిపారు. నిధులు సేకరించి వీధి దీపాలు ఏర్పాటు చేసుకునేందుకు బిజెపి గ్రామ కమిటీ అధ్యక్షుడు సొంట రవి ఆధ్వర్యంలో వినూత్న నిరసన వ్యక్తం చేశారు.



రాయిచేడ్ లో కుండ తీసుకొని బిక్షాటన చేస్తున్న బిజెపి కార్యకర్తలు

గ్రామంలో వీధి దీపాలు లేక అంధకారంలో ఉండిపోయామని గత కొన్ని నెలల నుంచి ఈ పరిస్థితి నెలకొందని , వీధులలో తిరగడానికి ప్రజలు ఎంతో ఇబ్బంది పడుతున్నారని, ఇటీవల కురిసిన వర్షాలకు వీధులలో చెత్తాచెదారం పేరుకుపోయిందని కనీసం వీధిలైట్లు ఏర్పాటు చేయకపోవడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాలకు వీధులలో విష పురుగులు, ఇళ్ల మధ్య మురుగునీరు ఏర్పడిందని వెంటనే అధికారులు స్పందించి గ్రామంలో వీధిలైట్లు, వీధులను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ బిక్షటన చేసి నిరసన తెలిపిన వారిలో రాయిచేడ్ గ్రామ కమిటీ అధ్యక్షుడు సొంట రవి, బిజెపి మండల ప్రధాన కార్యదర్శి మొగిలి అంజి, గ్రామ మాజీ అధ్యక్షుడు గుండ మోని జగదీష్, ఎత్తవు మధు, ఇంజమూరి తిరుపతి, దామెర్ల శ్రీను, రాజేష్, శివ, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# నాన్ టీచింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

### రేపు చలో ఎస్‌పిడి కార్యాలయానికి తరలి రండి

**నారాయణపేట టౌన్, సెప్టెంబరు 21 ప్రభాతవార్త :** కేజీబీవీలలో పనిచేస్తున్న వర్కర్లను, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ మొత్తాన్ని పర్మనెంట్ చేయాలని, వర్కర్లకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని పిఎఫ్ ఈఎస్ఐ గ్రాటియిటి చట్టాలు అమలు చేయాలని కోరుతూ చలో హైదరాబాద్ కార్యక్రమానికి నారాయణపేట జిల్లాలో పనిచేస్తున్న వర్కర్లందరూ కదిలి రావాలని తెలంగాణ ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బి. నరసింహ పిలుపునిచ్చారు. అధికారంలోకి ఏ పార్టీ వచ్చినా కేజీబీవీ లో పనిచేస్తున్న సిబ్బంది గురించి మాట్లాడడమే తప్ప ఆచరణలో వాళ్ళకు ఉద్యోగ భద్రత కల్పించడం లేదన్నారు. ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు అధికారంలో లేనప్పుడు కాంటాక్ట్ అవుట్‌సోర్సింగ్ వర్కర్స్‌ను పర్మినెంట్ చేస్తున్న హామీ ఇచ్చిండు వెంటనే ఆ హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో మరింత పోరాటాలు తీవ్రంగా చేయాల్సి వస్తుందని అవసరం వస్తే కేజీబీవీ వ్యవస్థని స్తంభింప చేయవలసి వస్తుంది ప్రభుత్వానికి హెచ్చరించారు. రేపు హైదరాబాదులో ఎస్‌పిడి కార్యాలయానికి కేజీబీవీ నాన్ టీచింగ్ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# దేవీ శరన్నవరాత్రి ఉత్సవ పుస్తకావిష్కరణ

**కల్వకుర్తి, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త:** శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవీ దేవాలయంలో నేటి నుంచి అక్టోబర్ 03వ తేదీ వరకు దేవీ శరన్నవరాత్రోత్సవాలు ఆలయ ఫౌండర్ ట్రస్టీ జూలూరి రమేష్‌బాబు, ఉత్సవ కమిటీ అధ్యక్షులు గందె రవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నారు. 10 రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు సహకరించే దాతల కార్యక్రమాల వివరాలను పుస్తకంలో పొందుపరిచామన్నారు. ఆదివారం ఉదయం దేవాలయ ఆవరణలో ఆలయ ఫౌండర్ ట్రస్టీ జూలూరి రమేష్‌బాబు, ఉత్సవ కమిటీ అధ్యక్షులు గందె రవి ఆధ్వర్యంలో పుస్తకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ సంఘం మండల అధ్యక్షుడు గంధం కిరణ్ ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు వాస శేఖర్, ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శులు డి.నితిన్, గుండల రేవంత్, కోశాధికారులు ఎస్.తరుణ్,పి.గిరిబాబు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు అనుబంధ సంఘాల నాయకులు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



దేవీ శరన్నవరాత్రి ఉత్సవ పుస్తకావిష్కరణ చేస్తున్న దృశ్యం

# తెలంగాణ తొలితరం ఉద్యమ నాయకులు

### కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి వేడుకలు

**కల్వకుర్తి, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త:** తెలంగాణ తొలితరం ఉద్యమ నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి వేడుకలను కల్వకుర్తి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. కల్వకుర్తి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో అమరవీరుల స్థూపం వద్ద కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం తో పాటు పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ఆశా జ్యోతి కొండా లక్ష్మణ్ బాపూజీ అని పేర్కొన్నారు. బాపూజీ స్వాతంత్ర్య ఉద్యమంలో, తెలంగాణ ఉద్యమంలో వారు చేసిన సేవలను ఘనసీయమని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం, బీసీ సబ్ ప్లాన్ సాధన కమిటీ అధ్యక్షులు మేకల రాజేందర్, పిఎసిఎస్ చైర్మన్ జనార్దన్ రెడ్డి, టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షులు బావండ్ల వెంకటేష్, పద్మశాలి సంఘం కార్యదర్శి మాకం రమేష్, కోశాధికారి గంజి ప్రసాద్, నాయకులు మధు, అమరేందర్, రమేష్ చారి, గంగాధర్ చారి, బాబీ దేవ్, శ్రీకాంత్, శ్రీనివాసులు, బోజిరెడ్డి, పాండు, జంగయ్య, గోవర్ధన్, వెంకటేష్, శ్రీను, శ్రీకాంత్, హరీష్, తదితరులు పాల్గొన్నారు.



బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

# అమావాస్య పూజలతో జనసంద్రమైన ఆలయాలు

**పెబ్బేరు, సెప్టెంబరు 21 ప్రభాతవార్త :** పెబ్బేరు మండలం వివిధ గ్రామాలలో ఆదివారం అమావాస్య సందర్భంగా పాతపల్లి చింతలకుంట శ్రీశ్రీశ్రీ ఆంజనేయస్వామి,మిట్ట ఆంజనేయ స్వామి ఆలయంలో, చింతలకుంట ఆంజనేయస్వామి ఆలయంలో,భక్తాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం రోజు ప్రత్యేక పూజలు స్వామివారికి తులసిమాల,నైవేద్యాలు, అభిషేకం,మహా మంగళ హారతి నిర్వహించారు.అమావాస్య పురస్కరించుకుని పాతపల్లి చింతలకుంట ఆంజనేయ స్వామి భక్తులు ఆరోజు అమావాస్య నుంచి అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు.పెబ్బేరు మండల పరిధిలో చింతకుంట ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం అమావాస్య సందర్భంగా పాతపల్లి గ్రామానికి చెందిన కావలి సురేష్ దంపతులు అన్నదాన కార్యక్రమంనిర్వహించగా,అమావాస్య రోజున భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





ఆలయంలో ప్రత్యేక దర్శనం చేసుకుంటున్న భక్తులు

# అమ్మవారి సన్నిధిలో

# గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

**అలంపూర్ సెప్టెంబర్ 21, ప్రభాతవార్త :** అష్టదశ శక్తిపీఠాలలో ఐదవ శక్తిపీఠమైన జోగులాంబ దేవి బాలబ్రమేశ్వర స్వామి ఆలయాలను జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కుటుంబ సమేతంగా ఆలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. పుట్టినరోజు సందర్భంగా ఆలయాల దర్శించుకోవడం జరిగిందని తెలిపారు. ముందుగా వీరికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. బాలబ్రమేశ్వర స్వామి ఆలయంలో అభిషేకం జోగులాంబ అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అధికారులు వారికి శాలువతో ఘనంగా సత్కరించారు. ఆలయాల విశిష్టతల గురించి ఆలయ అర్చకులు వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

# భక్తుల కొంగుబంగారం శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి

- నేటి నుంచి దసరా శరన్నవరాత్రోత్సవాలు...
- ఉత్సవాలకు ఏర్పాట్లను పూర్తి చేసిన నిర్వాహకులు

**కల్వకుర్తి, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త:** గత 37 సంవత్సరాల నుంచి నేటి వరకు త్రికాలములందు దూప, దీప నైవేద్యములతో ఆధ్యాత్మిక కేంద్రంగా నిత్యం వేద పఠనములతో, మంత్రోచ్చారణలతో మహిమాన్వితముగా పవిత్రను చేకూర్చి పరిసర ప్రాంతాల్లో పేరుగాంచిన దేవాలయంగా కల్వకుర్తి పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయం వెలుగొందుతుంది. భక్తుల కొంగుబంగారంగా వెలుగొందుతున్న శ్రీశ్రీశ్రీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయని ఆలయ ఫౌండర్ ట్రస్టీ జూలూరి రమేష్‌బాబు అన్నారు. పది రోజుల పాటు ఉత్సవాలను అంగరంగా వైభవంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు పూర్తి ఏర్పాట్లు చేశారు. అమ్మలగన్నయమ్మ ముగ్గురమ్మల మూలపుటమ్మ, ఆది పరాశక్తియైన కన్యకాపరమేశ్వరి దేవిని ప్రతి సంవత్సరం ఆశ్వీయుజ మాసము నందు పది దినములు పది అవతారాల్లో అలంకరించి పూజించిచడం అనవాయితీ. ఈ నెల 22 నుంచి అక్టోబర్ 03వ తేదీ వరకు అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉత్సవాలను కన్నుల పండువగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాలను పురస్కరించుకొని ఇక్కడికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు, ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఫౌండర్ ట్రస్టీ జూలూరి రమేష్‌బాబులు తెలిపారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా రంగులతో, విద్యుద్దీపాలతో, పచ్చటి తోరణాలతో శోభాయమానంగా అలంకరించామన్నారు. ఉత్సవాలను తిలకించేందుకు ప్రతి ఏటా కల్వకుర్తి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారి కృపకు పాత్రులవుతారన్నారు.



శ్రీ కన్యకాపరమేశ్వరి దేవి ఆలయం



కన్యకాపరమేశ్వరి మూల విరాట్

# దసరాకు ఊరేళ్తున్నారా జరభద్రం !

**శ్రీరంగాపూర్, సెప్టెంబరు 21 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ ఎస్సై హిమబిందు మాట్లాడుతూ దసరా పండుగ పిల్లలకు సెలవులు ఉండడంతో చాలామంది ప్రయాణాలు చేస్తారు. అదే అదునుగా దొంగలు చేతివాటం ప్రదర్శిస్తారు. ఊళ్ళకు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలని, ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. దసరా పండగ దృష్ట్యా చోరీల నియంత్రణకు పోలీసులు అన్ని చర్యలు చేపట్టి ప్రజలను అప్రమత్తం చేస్తున్నామన్నారు. రాత్రి వేళల్లో విధుల్లో ముమ్మరంగా గస్తీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ విషయంలో ప్రజలు కూడా జాగ్రత్తలు తీసుకోవాలి... దసరాకి వెళ్లే వారికి పోలీసుల సూచనలో.. ఇంట్లో బంగారు నగలు, ఉంటే వాటిని బ్యాంకు లాకర్లో భద్రపరచుకోవడం క్షేమం, ఎక్కువ రోజులు ఊళ్ళకు వెళ్లేవారు విలువైన వస్తువులను వెంట తీసుకువెళ్లాలి, ఊరు వెళ్తున్నప్పుడు పక్కింటి వారికి ఇంటి పరిసరాలను గమనించాలని చెప్పాలి, విలువైన వస్తువులను స్కూటర్ డిక్కీలో కారులలో పెట్టడం చేయరాదు, ద్విచక్ర వాహనాలు, కారులను ఇంటి ఆవరణలోనే పార్కింగ్ చేయాలి, రోడ్లపై నిలపరాదు, బీరువా తాళాలను ఇంట్లో ఉంచరాదు, తమతోపాటే తీసుకెళ్లాలి, గ్రామాలకు వెళ్లేవారు ఇంట్లో ఏదో ఒక గదిలో లైట్ వేసి ఉంచాలి,విలువైన వస్తువుల సమాచారాన్ని, వ్యక్తిగత ఆర్థిక విషయాలను ఇతరులకు చెప్పకూడదు, ఆరుబయట వాహనాలకు హ్యాండిల్ లాక్ తో పాటు వీల్ లాక్ వేయాలి, ఇంటి తలుపులకు సెంట్రల్ లాకింగ్ సిస్టంను ఏర్పాటు చేసుకొని, వాచ్మెన్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం మంచిది. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా సిసి కెమెరాలను ఇంటర్నెట్ అనుసంధానం ఉన్న మీ మొబైల్ నుంచే మీ ఇంటిని ఎక్కడి నుంచి అయినా ప్రత్యక్షంగా చూసుకునే వీలుంటుంది, ప్రజలు తమ ప్రాంతాలలో గస్తీ ఏర్పాటుకు సహకరించాలి. తమ ప్రాంతం పరిధిలోని పోలీస్ స్టేషన్ అధికారి ఫోన్ నెంబర్ ఇతర అధికారుల నెంబర్లు ప్రజలు తమ సెల్ ఫోన్లలో ఉంచుకోవాలి. అనుమానస్పద, కొత్త వ్యక్తుల కదలికలపై 100 డయల్, వనపర్తి పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 6303923200 కు, పోలీస్ అధికారులకు గానీ సమాచారం ఇవ్వాలి. ప్రజలు పోలీసులతో సమన్వయంగా సహకరిస్తే చోరీలను నియంత్రించవచ్చని సంతోషకరమైన పండుగను ముందస్తు జాగ్రత్తలతో ఎలాంటి అవాంఛనీయమైన సంఘటనలు లేకుండా వాహన ప్రయాణాలు చేస్తారు. కాబట్టి జాగ్రత్తలు పాటించాలని, రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ జాగ్రత్తగా, వాహనాలను నడుపుతూ ప్రశాంతంగా, క్షేమంగా తమ గమ్యస్థానాలకు చేరుకొని సంతోషంగా పండుగను జరుపుకోవాలని జిల్లా, మండల పోలీసులు కోరుకుంటున్నారు.





ఎస్సై హిమబిందు

**అప్రమత్తంగా ఉండాలి**

**కొత్తవారి కదలికలపై పోలీసులకు**

**సమాచారం అందించాలి**

**కాలనీల్లో, ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాల**

**ఏర్పాటు శ్రేయస్కారం : ఎస్సై హిమబిందు**

# నవరాత్రి ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు

**మక్తల్ టౌన్, సెప్టెంబరు 21 ప్రభాతవార్త :** మక్తల్ పట్టణంలోని డిగ్రీ కాలేజీ శాశ్వత భవనం కోసం సంత బజారులోని ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ ఫిష్ మార్కెట్ ను మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు అధికారులు పరిశీలించారు. విద్యాశాఖ ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన ఏఈ నాయక్‌తో పాటు మున్సిపల్ కమిషనర్ శ్రీరాములు, ఏఈ నాగశివ, కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ ఎ.రవికుమార్ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డిగ్రీ కాలేజీ భవనం కోసం పూర్తి అంచనాలు రూపొందించి, నివేదిక సిద్ధం చేయాల్సిందిగా మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశించినట్లు అధికారులు తెలిపారు. నూతన హంగులతో పూర్తి సదుపాయాలతో డిగ్రీ కాలేజీ శాశ్వత భవనం అందరికీ అందుబాటులో ఉండే విధంగా రూపొందించాలని మంత్రి ఆదేశాల మేరకు అధికారులు సర్వే చేపట్టినట్లు తెలిపారు. అనంతరం విజయదశమి శరన్నవరాత్రుల ఉత్సవాలను పురస్కరించుకొని మక్తల్ పట్టణంలోని నల్లజానమ్మ ఆలయంతో పాటు వెంకటేశ్వరస్వామి ఆలయం, వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద ఉత్సవాల ఏర్పాట్లను మున్సిపల్ శాఖ అధికారులు పరిశీలించారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయ పరిసరాల్లో చెత్తాచెదారం శుభ్రం చేసి, రహదారిని పూర్తిగా శుభ్రంగా ఉంచి భక్తులకు పూర్తిగా అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టారు. నవరాత్రి ఉత్సవాలు జరిగే అన్ని రోజులపాటు పూర్తిగా పారిశుద్ధ పర్యవేక్షణను ఇప్పటికప్పుడు పరిశీలించి, పరిసరాలను శుభ్రంగా ఉంచే బాధ్యత మున్సిపల్ సిబ్బందిదే అని తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా నవరాత్రి ఉత్సవాలు జరుపుకునేందుకు మున్సిపల్ శాఖ తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. శరన్నవరాత్రుల ఉత్సవాలను పుర స్కరించుకొని మక్తల్ పట్టణంలోని నల్లజానమ్మ ఆలయంతో పాటు వెంకటేశ్వర స్వామిఆలయం,వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద ఉత్సవాల ఏర్పాట్లను మున్సిపల్ శాఖ అధికారులు పరిశీలించారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయ పరిసరాల్లో చెత్తాచెదారం శుభ్రం చేసి,రహదారిని పూర్తిగాశుభ్రంగా ఉంచి భక్తులకు పూర్తిగా అందుబాటులో ఉండేవిధంగా చర్యలు చేపట్టారు. నవరాత్రి ఉత్సవాలు జరిగే అన్నిరోజులపాటు పూర్తిగా పారిశుద్ధపర్యవేక్షణను ఇప్పటికప్పుడు పరిశీలించి, పరిసరాలను శుభ్రంగా ఉంచే బాధ్యత మున్సిపల్ సిబ్బందిదే అని తెలిపారు. ఎలాం టి ఇబ్బందులు లేకుండా నవరాత్రి ఉత్సవాలు జరుపుకునేందుకు మున్సిపల్ శాఖ తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామ న్నారు. ఏర్పాట్లను పర్యవేక్షించిన వారిలో మున్సిపల్ కమిషనర్ శ్రీరాములు, ఏఈ నాగశివ, కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ ఏ.రవికుమార్ ఉన్నారు.



కళాశాల శాశ్వత భవనానికి స్థల పరిశీలన చేస్తున్న దృశ్యం



శరన్నవరాత్రుల నిర్వహణకు ఏర్పాట్లు పరిశీలిస్తున్న దృశ్యం

# గ్రామాలలో నెలకొన్న అమ్మవారి ఉత్సవమూర్తులు

### నేటి నుంచి దేవీ నవరాత్రి ఉత్సవాలు

**ఉప్పునుంతల, సెప్టెంబరు 21 ప్రభాతవార్త :** శరన్న దేవీ నవరాత్రి ఉత్సవాలు గ్రామాలలో నెలకొన్నాయి. నేటి నుంచి అక్టోబర్ 2 వరకు ఉత్సవాలు కొనసాగనున్నాయి. శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు గ్రామాలలో గ్రామ యువజన సంఘాలు మండపాలను వివిధ రకాలుగా అలంకరించారు. మండల కేంద్రమైన ఉప్పునుంతల గ్రామ నడిబొడ్డున ఉన్న కోట బురుజు వద్ద నవ దుర్గ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యువకులు ఎంతో ఉత్సాహంగా పెద్ద ఎత్తున మండపాన్ని ఏర్పాటు చేశారు. మొట్ట మొదటిసారిగా ఈ స్థలంలో ఏర్పాటు చేయడం గ్రామస్తులు యువకులను ఎంతో అభినందిస్తున్నారు. అదేవిధంగా కోట బురుజు చుట్టూ,ఆంజనేయస్వామి ఆలయం వరకు విద్యుత్ దీపాలతో రోడ్డు మార్గం లో అలంకరించారు.దసర మహోత్సవాల్లో అమ్మవారు వివిధ అలంకరణ రూపంలో అవతరించ నున్నట్లు పూజారులు పేర్కొన్నారు.నేడు 22 న సోమవారం బాల త్రిపుర సుందరి దేవిగా, 23 న మంగళవారం గాయత్రి దేవి, 24 న అన్నపూర్ణాదేవి, 25 కాత్యాయని దేవీ, 26న ధనలక్ష్మి ్మ దేవి, 27 శనివారం లలితా దేవి,28 న ఆదివారం రాజరాజేశ్వరి దేవి,29 న సోమవారం సరస్వతి దేవి, 30 న దుర్గాదేవి, అక్టోబర్ 1 న మహిషాసురమర్దిని దేవి,02 న వాసవి కన్యకా పరమేశ్వరి దేవిగా దర్శనం ఇవ్వనున్నట్లు పూజారులు వివరించారు.



ఉప్పునుంతల కోట బురుజు వద్ద దేవీ నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన మండపం

# ప్రజా పోరాటాల ద్వారానే సమస్యల పరిష్కారం : సిపిఐ

**ఆత్మకూర్ సెప్టెంబర్ 21, ప్రభాతవార్త:** గత శాసనసభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేరాలంటే ప్రజా పోరాటాలను ఉధృతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజా పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని సిపిఐ జిల్లా సీనియర్ నాయకులు నరసింహయ్య శెట్టి అన్నారు. పార్టీ జాతీయ మహాసభలో చండీగఢ్లో జరగనున్న నేపథ్యంలో మహాసభలు విజయవంతం కావాలని కాంక్షి స్తూ మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం మతోన్మాదులను పెంచు పోషిస్తూ బడా కార్పొరేటర్ రంగాలకు మాత్రమే రుణాలను మాఫీ చేస్తూ సామాన్య ప్రజల నడ్డిపిస్తుందని ఆయన తీవ్రస్థాయిలో ఆరోపించారు. దేశంలో మత విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుకునేందుకు బిజెపి చేస్తున్న ప్రయత్నాలను కమ్యూనిస్టులు ఎక్కడికక్కడే నిలదీసి ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం గత శాసనసభ ఎన్నికల సమయంలో పలు హామీలు గుప్పించి ఇప్పటివరకు అమలు చేయకపోవడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు దేశవ్యాప్తంగా ప్రజా సమస్యల పోరాటానికి సిపిఐ ఆధ్వర్యంలో రాజీలేని పోరాటాలు కొనసాగిస్తామని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ ఆత్మకూరు మండల కార్యదర్శి లక్ష్మీ ్మనారాయణ శెట్టి జిల్లా నాయకులు మోష, శ్రీహరి స్థానిక నాయకులు ఖాజా పేరు తదితరులు పాల్గొన్నారు.



సిపిఐ కార్యాలయంలో జెండా ఆవిష్కరణ చేస్తున్న సీనియర్ నాయకులు నరసింహ శెట్టి

# గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు

**కల్వకుర్తి, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలం మార్చాల గ్రామ సమీపంలోని సూర్యలత స్పిన్నింగ్ మిల్లులో పనిచేస్తున్న అశ్విన్‌కుమార్ సాహూ గంజాయి విక్రయిస్తుండగా ఎస్సై మాధవరెడ్డి పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ప్రకారం... ఒరిస్సా రాష్ట్రానికి చెందిన అశ్విన్‌కుమార్ సాహూ సూర్యలత కాటన్ మిల్లులో వర్కర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి గంజాయి తాగే అలవాటు ఉండటంతో ఒరిస్సా రాష్ట్రం నుండి ఇక్కడికి వచ్చిన క్రమంలో తన వెంట గంజాయి తీసుకొని వచ్చి అవసరం ఉన్నవారికి గంజాయి విక్రయిస్తున్నాడు. అదే క్రమంలో శనివారం కాటన్‌మిల్లు సమీపంలో ఉన్న మైసమ్మ ఆలయం దగ్గర గంజాయి విక్రయిస్తున్నాడనే పక్కా సమాచారం మేరకు అశ్విన్‌కుమార్ సాహూను పట్టుకొని అతని దగ్గర నుండి 37 గ్రాముల గంజాయిని సీజ్ చేసినట్లు తెలిపారు. అతన్ని శనివారం రాత్రి మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు.

# గోలపల్లిలో పిడుగు పాటుకు మహిళ మృతి

**మక్తల్ టౌన్, సెప్టెంబరు 21 ప్రభాతవార్త :** మక్తల్ మండలంలోని గోలపల్లి గ్రామం వద్ద ఇద్దరు మహిళలు వ్యవసాయ పనులు చేసు కుంటూ ఉండగా వర్షం కురవడంతో మహిళ లు చెట్టు కిందికి వెళ్లి తలదాచుకుంటుండగా వాళ్లున్న చెట్టుపై పిడుగు పడింది. దీంతో మమత అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. మరో మహిళ సుజాతకు తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది.



# మెడిసిన్‌లో మెరిసిన ఆణిముత్యం సారిక

**నవాబుపేట, సెప్టెంబరు 21 ప్రభాతవార్త :** మొన్న ప్రభుత్వం విడుదల చేసిన మెడిసిన్ నీట్ పరీక్ష ఫలితాల్లో కొల్లూరు సారిక సత్తా చాటింది. మండల పరిధిలోని ఎన్మనగండ్ల గ్రామానికి చెందిన కొల్లూరి సారిక ఎంబిబిఎస్ సీటు సాధించింది. జిల్లా స్థాయిలో మంచి ర్యాంకు సాధించడంతో ఫస్ట్ ఫేస్‌లోనే హైదరాబాదులోని మెడిసిటీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ మేడ్చల్ హైదరాబాద్ లో సీటు సంపాదించింది. కుటుంబ సభ్యులు తండ్రి కొల్లూరు వెంకటేష్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తు తన కూతురును ఉన్నత స్థాయిలో తీర్చి దిద్దారు. డాక్టర్ కోర్సులో సీటు సాధించడంతో సారిక తల్లిదండ్రులకు కుటుంబ సభ్యుల ఆనందాలకు అవధులు లేకుండా పోయాయి. తల్లి కొల్లూరు సునీత కుటుంబ సభ్యులు గ్రామస్తులు సారికకు అభినందనలు తెలియజేశారు.



# నేడు సబ్ జూనియర్ కబడ్డీ జట్ల ఎంపిక

**నారాయణపేట టౌన్, సెప్టెంబరు 21 ప్రభాతవార్త :** రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో పాల్గొనే నారాయణపేట జిల్లా బాల బాలికల జట్లను ఈనెల 22న ఉదయం 9 గంటలకు జడ్‌పిహెచ్‌ఎస్ మరికల్ క్రీడామైదానంలో ఎంపికలు చేయనున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి డోకూర్ తిరుపతిరెడ్డి, జిల్లా నిర్వహణ కార్యదర్శి వెంకటప్ప ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 31/9/2009 తర్వాత జన్మించిన వారు ఆధార్ కార్డుతో హాజరు కావాలన్నారు. ఈనెల 25 నుండి 28 వరకు నిజాంబాద్ జిల్లాలో నిర్వహించినట్లు తెలిపారు. పూర్తి వివరాల కోసం 9908933358,94914 89754 సంప్రదించాలన్నారు.

# యూనివర్సిటీ ఎన్నికల్లో ఏబీవీపీ ఘన విజయం

## వనపర్తిలో విజయోత్సవ వేడుకలు



రాజీవ్ చౌరస్తాలో సంబరాలు నిర్వహిస్తున్న ఏబీవీపీ నాయకులు

**వనపర్తి, సెప్టెంబరు 21 ప్రభాతవార్త :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఎబివిపి) వనపర్తి జిల్లా ఆధ్వర్యంలో, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ స్టూడెంట్ యూనియన్ ఎన్నికల్లో ఏబీవీపీ ప్యానెల్ ఘనవిజయం సాధించిన సందర్భంగా వనపర్తి జిల్లా కేంద్రంలో విజయోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ అర్జున్ సాతర్ల మాట్లాడుతూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ స్టూడెంట్ యూనియన్ ఎన్నికల్లో ఏబీవీపీ ప్యానెల్ వామపక్ష విద్యార్థి సంఘాల కూటమిపై క్లీన్ స్వీప్ చేసి, విద్యార్థుల ఆశలని నెరవేర్చింది. అధ్యక్షుడిగా శివ పాలేపు, ఉపాధ్యక్షుడిగా దేవేంద్ర, జనరల్ సెక్రటరీగా శృతి, జాయింట్ సెక్రటరీగా సౌరబ్ శుక్ల, స్పోర్ట్స్ సెక్రటరీగా జ్వాల ప్రసాద్, కల్చరల్ సెక్రటరీగా వీనస్ విజయం సాధించారు. స్కూల్ కౌన్సిలర్లు, బోర్డు మెంబర్లలో కూడా ఏబీవీపీ ఘనవిజయం సాధించింది. గత ఆరు సంవత్సరాలుగా ఎన్ఎస్‌యుఐ వామపక్ష కూటమి వైఫల్యాలను గుర్తించిన విద్యార్థులు, ఏకతాటిగా నిలబడి ఎబివిపికి పట్టం కట్టారు. హెచ్‌సియు భూముల పరిరక్షణ, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలలో ఎప్పుడూ ముందుండిన ఏబీవీపీనే విద్యార్థులు ఎన్నుకోవడం విశేషం. ఎన్ఎస్‌యుఐకి నోటా కంటే తక్కువ ఓట్లు రావడం, వామపక్ష భావజాలం పతనం కావడం - విద్యార్థులు కాంగ్రెస్ రాజకీయాలను తిరస్కరించిన తేటతెల్లమైన సంకేతం. సోషల్ సైన్సెస్ విభాగాల్లో కూడా వామపక్ష ప్రొఫెసర్ల ప్రభావాన్ని పక్కన పెట్టి, విద్యార్థులు ఏబీవీపీని గెలిపించడం చారిత్రాత్మకం అని అన్నారు. కార్యక్రమంలో జగదీష్, బంటి, నితిన్, అనిల్, నందు, చక్రి, వెంకటేష్, పవన్, అభిషేక్ పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

## ట్రాఫిక్ నియమాలను పాటించాలి : ఎస్సై హిమబిందు


ప్రజలకు అవగాహన కలిగిస్తున్న ఎస్సై హిమబిందు

**శ్రీరంగాపూర్, సెప్టెంబరు 21 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో శ్రీరంగాపూర్ ఎస్సై హిమబిందు ఆధ్వర్యంలో మండలంలో సైబర్ నేరాల పైన ట్రాఫిక్ నిబంధనల గురించి, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా కంప్యూటర్, ఇంటర్నెట్ టెక్నాలజీలను ఉపయోగించి అపరిచిత వ్యక్తుల నుంచి కానీ సంస్థల నుంచి మోసపూరితమైన ఫోన్ కాల్స్ ద్వారా కానీ మెసేజ్‌ల ద్వారా గాని వ్యక్తుల నుంచి వ్యక్తిగత సమాచారాన్ని సేకరించి డబ్బులను దోచేస్తున్నారు. కనుక అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్ చేస్తే వ్యక్తిగత సమాచారాన్ని ఇవ్వకూడదని, అలాంటి ఫోన్ కాల్స్ వస్తే సంబంధిత పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని తెలియజేయడం జరిగింది. దసరా పండుగ సందర్భంగా తమ ఊళ్ళకు ప్రయాణం చేసేవారు ట్రాఫిక్ నియమాలను ఉల్లంగించకుండా ట్రాఫిక్ నియమాలను పాటించి తమ గమ్య స్థలాన్ని సురక్షితంగా చేరుకోవాలని చెప్పడం జరిగింది.

# దేవ బండ వాగుపై బ్రిడ్జిని వెంటనే నిర్మించాలి


వాగును పరిశీలిస్తున్న బిజెపి నాయకులు

**అయిజ సెప్టెంబర్ 21, ప్రభాతవార్త :** మండల పరిధిలోని దేవబండ గ్రామ పరిధిలోని వాగుపై వెంటనే బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని బిజెపి నాయకులు డిమాండ్ చేశారు ఆదివారం మండల బిజెపి నాయకులు, గ్రామస్తుల తో కలిసి బిజెపి జిల్లా మాజీ అధ్యక్షులు రామచంద్రారెడ్డి వాగును సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలా సంవత్సరాలుగా దేవ బండ గ్రామానికి వాగుపై బ్రిడ్జి నిర్మించకపోవడంతో రాకపోకలు తీవ్ర ఇబ్బందిగా మారిపోయాయని ఏ చిన్నపాటి వర్షం పడిన వాగు ఉధృతంగా ప్రవహించడంతో ఎక్కడివారు అక్కడే నిలిచిపోవాల్సి వస్తుందన్నారు. గ్రామస్తులు ఏ చిన్నపాటి అవసరం ఉన్న ఐజ పట్టణానికి రావాల్సి ఉంటుంది. కానీ ఈ బ్రిడ్జి లేకపోవడంతో వర్షాకాలంలో గ్రామస్తులు ఎక్కడ పోవాలో అర్థం కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే గ్రామానికి స్కూల్ బస్సు రాకపోవడంతో విద్యార్థులను తల్లిదండ్రులు ఈ వాగు దగ్గర తెచ్చి బస్సు ఎక్కించడం మరలా తీసుకపోవడం జరుగుతుందని ఇంత నరకయాతన అనుభవిస్తున్న కనీసం ప్రజాప్రతినిధులు గానీ అధికారులు గానీ స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ ప్రజాప్రతినిధులు అధికారులు స్పందించి వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని వారి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిజెపి మండలాధ్యక్షుడు గోపాలకృష్ణ,బిజెపి జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ యాదవ్ ,ఐజ పట్టణ ఉపాధ్యక్షులు లక్ష్మణ గౌడ్, దేవబండ భూత అధ్యక్షులు రామకృష్ణ, టి నర్సింలు ,లక్ష్మణాచారి, ఉప్పల ముదిరాజ్ శంకరన్న మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు


కార్మికులకు బట్టలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి

**గద్వాల టౌన్ సెప్టెంబర్ 21, ప్రభాతవార్త:** గద్వాల జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ సమీపంలో బీ కే ఏం ఆర్ క్యాంటీన్ ఐదు రూపాయల భోజనం దగ్గర ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాంటీన్ల లో పనిచేస్తున్న వారి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జన్మదిన సందర్భంగా ఎమ్మెల్యే తనయుడు బండ్ల సాయి సాకేత్ రెడ్డి, మోహన్ రెడ్డి తో కలిసి కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించి ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా ఐదు రూపాయల కాంటీన్ లో ఎమ్మెల్యే చేతుల మీదుగా పేద ప్రజలకు అన్నం ప్లేట్లను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదనీ, గత రెండు సంవత్సరాల కిందట ఎమ్మెల్యే జన్మదిన పురస్కరించుకొని ఎమ్మెల్యే సొంత ఖర్చులతో గద్వాలకు వివిధ ప్రాంతాల నుండి వచ్చే ప్రజల కోసం ఐదు రూపాయల భోజనం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 2022వ సంవత్సరం , సెప్టెంబర్ 21న ఎమ్మెల్యే జన్మదిన పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఐదు రూపాయల క్యాంటీన్ నేటికీ 3 సంవత్సరాలు పూర్తి చేసుకోవడంతో హర్షం వ్యక్తం చేశారు. క్యాంటీన్ ను భవిష్యత్తులో కూడా కొనసాగించే విధంగా కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి జన్మదిన సందర్భంగా పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు బట్టల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీధర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించగా ఎమ్మెల్యే చేతుల మీదుగా పారిశుద్ధ్య కార్మికులకు మహిళలకు చీరల ను, పురుషులకు బట్టలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జానకి రామ్, మున్సిపల్ సిబ్బంది, సీనియర్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన శక్తిపీఠం

**నారాయణపేట టౌన్, సెప్టెంబరు 21 ప్రభాతవార్త :** దసరా పండుగ సందర్భంగా శ్రీ దేవి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలు సందర్భంగా నారాయణపేట జిల్లా కేంద్రంలోని శక్తి పీఠం ఆధ్వర్యంలో ఈనెల 22 నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు కొనసాగనున్నట్లు శక్తిపీఠం శ్రీ సంత్ మఠ మూల మహా సంస్థానం వ్యవస్థాపకులు ఆదివారం ప్రకటనలో తెలిపారు. శక్తిపీఠంలో జరిగే కార్యక్రమాన్ని నిర్ణిత సమయానికి ప్రారంభమవుతాయని, భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులవ్వాలని కోరారు.

# మోడీ నాయకత్వంలో దేశాభివృద్ధి

- సేవ పక్వాడ కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ కార్మికులను సన్మానం
- పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టిన ఘనత మోడీ ప్రభుత్వానిదే..
- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ


పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న ఎంపి డికె అరుణ

**నారాయణపేట టౌన్, సెప్టెంబరు 21 ప్రభాతవార్త :** నరేంద్ర మోడీ నాయకత్వంలో భారతదేశం అభివృద్ధి చెందుతుందని పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణ అన్నారు. సేవ పక్వాడ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పార్లమెంటు సభ్యురాలు ఎంపీ డీకే అరుణ నారాయణపేట మండలం తిరుమలాపూర్ గ్రామంలో జరిగిన కార్యక్రమానికి హాజరయ్యారు. గ్రామస్తులు, బిజెపి కార్యకర్తలు ఎంపీకి ఘన స్వాగతం పలికారు. గ్రామంలో అంబేద్కర్, వివేకానందుని విగ్రహాలకు పూలదండ వేసి నివాళులు అర్పించారు. అనంతరం భారతీయ జనతా పార్టీ జెండా ఆవిష్కరించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎంపీ మాట్లాడుతూ నిరుపేదల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టిన ఘనత నరేంద్ర మోడీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. నరేంద్ర మోడీ నాయకత్వంలో భారతదేశం ఎంతో వేగంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజలు గ్రహించాలన్నారు. పేద ప్రజలకు ఆరోగ్యం విషయంలో పేద ప్రజలు పడరాదని అదే స్వస్థనారి సశక్తు పరివార్ అభియాన్ ఈ పథకం ద్వారా పేద ప్రజలు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు ఎలాంటి రోగాలకైనా ఉచితంగా టెస్టులు చేసి ఉచిత వైద్యాన్ని ఇవ్వాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకొ ఛ్చిందని అన్నారు. పేద ప్రజలందరూ మీ దగ్గరలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి మీ ఆరోగ్య పరిస్థితులను తెలుసుకొని పూర్తిగా ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ఏ దేశం వెళ్లిన నరేంద్ర మోడీ నాయకత్వాన్ని స్వాగతిస్తున్నారు. భారతదేశం వైపు చూసేటట్టుగా నరేంద్ర మోడీ చేస్తున్నారని అన్నారు. అంతకుముందు గ్రామపంచాయతీ కార్మికులను ఎంపీ సన్మానించారు. కార్యక్రమంలో బిజెపి నారాయణపేట జిల్లా అధ్యక్షులు సత్యా యాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రతంగ్ పాండు రెడ్డి, నారాయణపేట మాజీ జిల్లా అధ్యక్షులు పడుకుల శ్రీనివాస్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు కెంచ్ శ్రీనివాస్ ,సాయబన, బిజెపి మండల అధ్యక్షురాలు జ్యోతి, ప్రధాన కార్యదర్శి లక్ష్మి, సక ప్రవీణ్, వేపూర్ రవి, తిరుమలాపూర్ బిజెపి నాయకులు, ప్రజలు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# నేటి నుంచి శరన్నవరాత్రులు

## ముస్తాబైన అమ్మవారి ఆలయాలు



**భూత్పూర్,సెప్టెంబర్ 21,ప్రభాతవార్త :** ఆశ్వీయుజ మాసమారంభమైందటే చాలు అమ్మవారి నవరాత్రులు మొదలౌతాయి.వీటినే శరన్నవ రాత్రులంటారు. దుర్గాదేవి ఈ శరన్నవరాత్రులలో వివిధ రూపాల్లో దర్శనమిస్తుంది. అమ్మవారు రోజుకో అవతార రూపంలో భక్తులకు దర్శన మిస్తుంది. తొలిరోజు అమ్మవారు బాలాత్రిపురసుందరిదేవిగాను, రెండో రోజు శ్రీగాయత్రీదేవిగాను, మూడో రోజు శ్రీఅన్నపూర్ణాదేవిగాను,నాల్గో రోజు శ్రీకాత్యాయనీదేవిగాను, ఐదో రోజు శ్రీమహాలక్ష్మిదేవిగాను, ఆరోరోజు శ్రీలలితా త్రిపురసుందరీదేవిగాను, ఏడోరోజు శ్రీచండీదేవిగాను, ఎనిమిదో రోజు శ్రీ సరస్వతీదేవిగాను,తొమ్మిదో రోజు శ్రీదుర్గాదేవిగాను విభిన్న అవతార రూపాలలో భక్తులకు దర్శనమిచ్చి తరింపజేస్తుంది. పదో రోజున మహిషాసుర మర్ధినిగా దర్శనమివ్వడంతో శరన్నవరాత్రులు ముగిస్తాయి. ఆఖరి రోజున దసరా పండుగను వైభవంగా నిర్వహించి శమీపూజలు చేస్తారు.

**తెలంగాణ పూల పండుగ బతుకమ్మ**

తెలంగాణ రాష్ట్ర పూల పండుగ బతుకమ్మ వేడుకలు ప్రతీ ఏటా భాద్రపద మాస అమావాస్య మరుసటి రోజు నుంచే ఆరంభమౌతాయి. ఈ సారి అమావాస్యను మహాలయ అమావాస్యగా పేర్కొంటూ ఈ రోజున పితృతర్పణాలు చేస్తారు. పల్లెటూళ్లలో ఈ అమావాస్య రోజున పెద్దల పండు గగా మాతాపితృదేవుళ్లకు ప్రత్యేక తర్పణాలు చేస్తుంటారు. అమావాస్య మరుసటి రోజునే బతుకమ్మ పండుగ ఆరంభమౌతుంది.తీరొక్క పూలతో రోజుకో తీరున పూలతో అందంగా అలంకరిస్తూ బాలికలు, మహిళలు, అమ్మలక్కలందరూ బతుకమ్మలను రకరకాల పూలతో అందం గా పేర్చి మధ్యలో పసుపుముద్దతో గౌరమ్మ, బతుకమ్మను చేసి పెద్దపెద్ద పూబంతులుగా మార్చి గ్రామ,పట్టణ చావిడిలు, కూడళ్లల్లో బతుకమ్మ లనుంచి చుట్టూ బొడ్డెమ్మలు, బతుకమ్మ పాటలను పాడుతూ ఆడుతూ కోలాటాలతో అలరిస్తుంటారు. తొలిరోజు(22-09-2025)న ఎంగిలి పూల బతుకమ్మగా, రెండో రోజు(23-09-2025)న అటుకుల బతుకమ్మగా, మూడో రోజు(24-09-2025)న ముద్దపప్పు బతుకమ్మగా, నాల్గోరోజు(25-09-2025)న నానబియ్యం ఐదో రోజు (26-09-2025)న అటుకుల బతుకమ్మగా,ఆరో రోజు (27-09-2025)న అలిగిన బతుకమ్మగా, ఏడో రోజు(28-09-2025)న వేపకాయల బతుకమ్మగా, ఎనిమిదో రోజు(29-09-2025)న వెన్నముద్దల బతుకమ్మగా, చివరి రోజైన తొమ్మిదో రోజు(30-09-2025)న సద్దుల బతుకమ్మగాను తొమ్మిదో రోజు తీరొక్క పూలతో అందంగా అలంకరించి బతుకమ్మ సంబురాలను ఆడపడుచులు ఎంతో ఘనంగా నిర్వహిస్తారు. రోజు రోజుకు బతుకమ్మలను భారీ ఊరేగింపుతో సమీపంలోని కొలను, చెరువులలో జలప్రవేశం చేస్తారు. తంగేడుతో పాటు గునుగుపూలు, బంతి, చామంతి,మందారం, గులాబీ, మల్లె, జాజిమల్లె, తీగమల్లె వంటి పూలతో బతుకమ్మలను తీర్చిదిద్ది, పేర్చి బతుకమ్మలను తొమ్మిది రోజుల పాటు మహిళలు, ఆడపడుచులు ముచ్చటగా నిర్వహిస్తారు.

# తపోవన్ పాఠశాలలో బతుకమ్మ వేడుకలు



బతుకమ్మలతో ఉపాధ్యాయులు, విద్యార్థులు

**దేవరకద్ర, సెప్టెంబరు 21 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం, డోకూరు సమీపంలోని తపోవన్ పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. పాఠశాలలకు చెందిన మహిళ ఉపాధ్యాయులు, విద్యార్థినిలు, తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, గౌరమ్మను భక్తిశ్రద్ధలతో పూజించారు. అనంతరం సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ, కోలాటాలతో అట్టహాసంగా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వర్కుట్టి నిరంజన్ రెడ్డి, పావని, మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందన్నారు. తొమ్మిది రోజుల బతుకమ్మ సంబరాలను పురస్కరించుకొని పాఠశాలలో ఉపాధ్యాయ బృందం, బతుకమ్మ ఉత్సవాలపై విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల ఆట పాటలు అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రయ్య, నరసింహులు, రవి, శ్రీనివాసులు, ఇక్బాల్ పాషా, తిరుపతయ్య, కురుమూర్తి, నాగరాజు, అనురాధ, ఉమా, సబిహా, పావని, అనిత, భవాని, స్వప్న, శిరీష, కరిష్మా, మౌనిక, లత, గౌతమి పాల్గొన్నారు.

# క్రీడల్లోనూ రాణించాలి


## జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి సీతారాం


వెల్టూరు హైస్కూల్‌లో కొనసాగుతున్న శిబిరానికి హాజరైన యువజన క్రీడలు అధికారి సీతారాం

**ఉప్పునుంతల, సెప్టెంబరు 21 ప్రభాతవార్త :** విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని నాగర్ కర్నూల్ జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి సీతారాం సూచించారు. ఆదివారం సాయంత్రం మండలంలోని వెల్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 35వ సబ్ జూనియర్ జిల్లా కబడ్డీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు కొనసాగుతున్న శిక్షణ శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా క్రీడకారులతో మాట్లాడుతూ కబడ్డీ పోటీల్లో రాష్ట్రస్థాయిలో నాగర్ కర్నూల్ జిల్లాకు వన్నె తీసుకురావాలని ఆయన సూచించారు. క్రీడాకారులకు గ్రామానికి చెందిన కాశిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి సీతారాం, వ్యాయామ ఉపాధ్యాయులు రమేష్,మాజీ సర్పంచ్ గుండె మోని లింగమయ్య యాదవ్, గ్రామస్తులు బూసిరాజు మల్లయ్య, జిల్లా టెక్నికల్ బోర్డు అఫీషియల్ మెంబర్ శ్రీనివాసులు, కబడ్డీ అసోసియేషన్ మెంబర్ మోహన్ గౌడు, యువకులు గుద్దటి బాలరాజు, ఉప్పరి బాలరాజ్, సమ్మద్ పాల్గొన్నారు.

# గ్రామీణులకు సేవలందించడం గొప్పవిషయం

## ఎస్ఏపీ కిడ్నీ సెంటర్ వైద్యులకు
## మాజీ మంత్రి లక్ష్మారెడ్డి అభినందన


వైద్యులను సన్మానిస్తున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

**జడ్చర్ల, సెప్టెంబరు21,ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంతాలలో పేదలకు వైద్య సేవలు అందించడం చాలా గొప్ప విషయం అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు డా. సి. లక్ష్మారెడ్డి అన్నారు. జడ్చర్ల మండల పరిధిలోని నసురుల్లాబాద్ గ్రామంలో ఏర్పాటు చేసిన హైదరాబాద్‌కు చెందిన ఎస్ఏపీ కిడ్నీ అవగాహన కార్యక్రమంలో పాల్గొని యాజమాన్యం డాక్టర్ షోయబ్ అహ్మద్ ఖాన్, వారి బృందాన్ని లక్ష్మారెడ్డి అభినందించారు. తెలంగాణ రాష్ట్రంలో 40 డయాలసిస్ కేంద్రాలను ప్రభుత్వ ఆసుపత్రులలో ఏర్పాటుచేసి గ్రామీణ ప్రాంత ప్రజలకు డయాలసిస్ సేవలు చేరువ చేసినందుకు, జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి జడ్చర్ల ప్రాంత ప్రజలకు హైదరాబాద్ వెళ్లే బాధను తప్పించినందుకు లక్ష్మారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కోడుగల్ యాదయ్య, రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి ప్రనిల్ చందర్, శంకర్ నాయక్, ఇంతియాజ్ అహ్మద్ ఖాన్, కరాటే శ్రీను, సయ్యద్ నియాజ్ అహ్మద్ ఖాన్, రియాజ్ ఖాన్, రఫీ అహ్మద్, వెంకటేష్, శేఖర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఘనంగా గురజాడ జయంతి


గురజాడ అప్పారావు జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

**వడ్డేపల్లి, సెప్టెంబరు 21 ప్రభాతవార్త:** వడ్డేపల్లి మండలం జూలేకల్‌లో ఆదివారం గురజాడ అప్పారావు జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గురజాడ అప్పారావు రాసిన గేయం దేశమును ప్రేమించుమన్నా మంచి అన్నది పెంచుమన్నా అనే గేయం స్వాతంత్రోద్యమంలో ప్రజలను చైతన్యవంతం చేసిందని, కన్యాశుల్కం నాటకం ఆనాడు సమాజంలో పాతుకపోయిన మూఢనమ్మకాలను తొలగించిందని జూలేకల్ గ్రామ యువత కొనియాడారు. ఉత్సవాల్లో గ్రామస్తులు పాలొగన్నారు.

# ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

## ఎస్పీ యోగేష్ గౌతమ్



**నారాయణ పేట, సెప్టెంబరు 21 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లాలో వ్యాప్తంగా 156 దుర్గామాత విగ్రహాలు ఏర్పాటు చేసిన నేపథ్యంలో నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ సూచించారు. మండపాల వద్ద బందోబస్తు ఫైర్ సేఫ్టీ చర్యలు తీసుకోవాలని అనుమానాస్పద వ్యక్తులపై అప్రమత్తంగా ఉండి వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. టపాసులు డీజేలు నిషేధమని రాత్రి 10 తర్వాత స్పీకర్లు ఆపాలని తెలిపారు. విగ్రహ నిమజ్జనం సమయంలో పిల్లలను చెరువుల వద్దకు అనుమతించరాదని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేయకూడదని ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


## అమావాస్య సందర్భంగా అన్నదానం

**నారాయణపేట టౌన్, సెప్టెంబరు 21 ప్రభాతవార్త :** ఆదివారం అమావాస్య సందర్భంగా నారాయణపేట పట్టణానికి సమీపంలో మెట్టుగడ్డ వద్ద వెలసిన ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేపట్టారు. స్వామివారికి నైవేద్యంగా తీపి వంటలు సమర్పించారు. భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం అలా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులు మహిళలు పాల్గొన్నారు.

## నేడు ప్రజావాణి రద్దు

**నారాయణ పేట, సెప్టెంబరు 21 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలో నేడు నిర్వహించే పరిపాలనకు సంబంధించి జిల్లా జాక్ అధికారులందరితో ఉదయం 11.30 గంటలకు సమీక్షా సమావేశం ఉన్నందున నేడు జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం అర్జీలు తీసుకుని ఎవరూ కలెక్టరేట్ కు రావొద్దని కోరారు.

## డాక్టర్ సీటు సాధించిన కూలిబిడ్డ



**శ్రీరంగాపూర్, సెప్టెంబరు 21 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ మండల కేంద్ర అంబేద్కర్ నగర్‌కు చెందిన నాగమ్మ స్వామి కుమారుడు నాగమ్మ మనోజ్ 384 మార్కులతో నిర్మల్( అదిలాబాద్) ప్రభుత్వ కళాశాలలో సీటు పొందడం జరిగింది. మనోజ్ తల్లిదండ్రులు హైదరాబాదులో దినసరి కూలీలుగా పని చేస్తూ తమ కుమారుడిలో ఉన్న నైపుణ్యాన్ని, చదువుపై ఉన్న ఆసక్తిని గుర్తించి ఉన్నత చదువుల వైపు ప్రోత్సహించడం జరిగింది. వారి నమ్మకాన్ని నిలబెట్టి ఎంబిబిఎస్ సీట్లు సాధించినందుకు మనోజ్ తల్లిదండ్రులు సంతోషాన్ని వ్యక్తం చేయడం జరిగింది. విజయానికి తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు, అంబేద్కర్ కాలనీవాసులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## నేటి నుంచి దసరా నవరాత్రి ఉత్సవాలు

**శ్రీరంగాపూర్, సెప్టెంబరు 21 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని ఎంతో ప్రసిద్ధిగాంచిన శ్రీ శ్రీ రంగనాయక స్వామి వారి దేవస్థానంలో నేటి నుంచి అక్టోబరు 2 వరకు జరుగు దసరా నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 10 రోజులపాటు శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి పది అలంకారములతో సహస్రనామార్చనలు జరుగునని, భక్తులు వచ్చి దర్శించుకుని పూజా కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని రంగనాయక స్వామి అర్చకులు తెలియజేశారు.

## అమ్మవారికి గద్వాల సంస్థానం వంశస్తుల చీరల బహుకరణ

**అలంపూర్ సెప్టెంబర్ 21, ప్రభాతవార్త :** 18 శక్తి పీఠాలలో ఐదవ శక్తిపీఠమైన ఐదవ శక్తిపీఠమైన జోగులాంబ అమ్మవారికి, దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా, జోగులాంబ గద్వాల సంస్థానంకు,చెందిన వారి వంశస్థులు తొమ్మిది రోజులపాటు అలంకరించుటకు 9 చీరలను బహుకరించడం జరిగిందని ఆలయ యువ దీప్తి తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని ఏకైక శక్తిపీఠంగా విరాజిల్లుతున్న జోగులాంబ అమ్మవారికి గద్వాల సంస్థానం చెందిన వంశిస్థులు తొమ్మిది రోజులపాటు చీరలను బహుకరించడం చాలా సంతోషకరమని పాలకమండలి చైర్మన్ కొంకల నాగేశ్వర్ రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. అమ్మవారి ఆలయంలో అంగరంగ వైభవంగా నిర్వహించే దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను తెలంగాణ కర్ణాటక ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వస్తారని ఆలయ దీప్తి తెలిపారు. వివిధ దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కొరకు ఆలయంలో భక్తుల కొరకు ప్రత్యేక ఏర్పాట్లను చేశామని అన్నారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు కలవకుండగా ఆలంపూర్ చౌరస్తా మరియు కర్నూలు గద్వాల నుండి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అమ్మవారిని స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులకు ప్రత్యేక క్యూ లైన్ లను ఏర్పాటు చేయడం జరిగిందని ఆమె అన్నారు. వికలాంగులకు మహిళలకు, వృద్ధులకు, ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేశామన్నారు.



గద్వాల వంశస్తుడు బహుకరించిన చీరలు

## క్రీడలకు అత్యంత ప్రాధాన్యత

**మొదటి పేజీ తరువాయి భాగం..**

ఇక్కడే అనేక క్రీడల్లో పాల్గొన్నారన్నారు. క్రీడాకారులకు ఏ విధమైన సహాయ సహకారాలు కావాలన్నా హైదరాబాద్లోని క్రీడా ప్రాధికార సంస్థకు వెళ్లి కలిస్తే ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని చెప్పారు. వనపర్తి జిల్లాకు స్పోర్ట్స్ స్కూల్ మంజూరు చేసిందని, అదేవిధంగా పెద్దమందడి, ఘనపూర్ మండలాలకు మినీ స్టేడియంలో శాంక్షన్ చేసిన సీఎంకు, క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్కు ధన్యవాదాలు తెలిపారు. జిల్లా కేంద్రానికి సమీపంలో 9 ఎకరాల్లో క్రికెట్ కోసం స్థలాన్ని కేటాయించినట్లు కూడా ఎమ్మెల్యే తెలియజేశారు. సెపక్ తాక్రా క్రీడల్లో రాణించి ఇన్కమ్ టాక్స్ విభాగంలో ఉద్యోగాన్ని సంపాదించిన ఘనపురం అమ్మాయి నవతను ఎమ్మెల్యే అభినందించారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకొని అందరూ క్రీడల్లో రాణించాలని తెలిపారు. కార్యక్రమంలో సెపక్ థాక్రా క్రీడల జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, జిల్లా క్రీడల అధికారి సుధీర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సెపక్ థాక్రా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సెక్రెటరీ పబ్బ భాస్కర్ గౌడ్, ఇతర ప్రజాప్రతినిధులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి

**పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ వర్ధంతి**



కొండా లక్ష్మణ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

**మహబూబ్‌నగర్, సెప్టెంబరు21,ప్రభాతవార్త;** తెలంగాణ సాధనకు పరితపించిన మహోన్నత వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ అని పద్మశాలీ సంఘం నాయకులు కొనియాడారు. మహబూబ్‌నగర్‌లోని శివ మార్కండేయ దేవాలయం భవనంలో,పద్మావతికాలనీ గ్రీన్‌బెల్ట్ వద్ద పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు అనంత రాములు, పట్టణ అధ్యక్షుడు బాలరాజ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమస్ఫూర్తి ప్రధాత పదవుల కోసం పాకు లాడకుండా నీతి నిజాయితీతో తెలంగాణ కోసం పోరాడిన కొండా లక్ష్మణ్ బాపూజీ మహనీయుడు అని అన్నారు. అనంతరం బాపూజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షులు అనంతరాములు వెంకటేష్, సూర్య ప్రతాప్, సుకు మార్, కిషోర్, భీంపల్లి శ్రీకాంత్, భోగం శివాజీ, బాలకృష్ణ కొంగరి వెంకటేష్, రాఘవేందర్ నరేష్, కోడి రాజశేఖర్ ,తదితరులు పాల్గొన్నారు.

## విలువలతో కూడిన సమాజాన్ని నిర్మించడంలో జర్నలిస్టుల కృషి ఎనలేనిది

**టియు డబ్ల్యూజె (ఐజెయూ) జిల్లా అధ్యక్షుడు మాధవరావుకు సన్మానం**

**వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్**



టియు డబ్ల్యూజె (ఐజెయూ) జిల్లా అధ్యక్షులు మాధవరావును సన్మానిస్తున్న దృశ్యం

**వనపర్తి రూరల్, సెప్టెంబరు 21 ప్రభాతవార్త:** నైతిక విలువలతో కూడిన సమాజాన్ని నిర్మించడంలో జర్నలిస్టుల కృషి ఎనలేనిదని వనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆదివారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో 11వ అంతర్ జిల్లా సీనియర్ మెన్స్ అండ్ ఉమెన్స్ సెపక్ తాక్రా చాంపి యన్షిప్ క్రీడా పోటీలకు శివసేన రెడ్డి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిలు ము ఖ్య అతిథిగా హాజర య్యారు. ఈ క్రీడలకు వనపర్తి మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాస గౌడ్ అధ్యక్షత వహించారు. అనంతరం టియు డబ్ల్యూజే (ఐజేయూ) యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన మాధవరావును ఆయన శాలువాతో సన్మానించారు. ఈసందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ జర్నలిస్టులు నిరంతర శ్రామి కులని,ప్రభుత్వాలు చేస్తున్న తప్పిదలను ఎత్తిచూ పుతూ ప్రజలకు ప్రశ్నించే గొంతుకలుగా నిలబడు తుండడం చాలా గర్వకారణ మన్నారు. జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్‌తో పాటు భాస్కర్ గౌడ్, భాస్కర్ రెడ్డి, గట్టు వెంకన్న, ఉప్పల భాస్కర్, జగదీశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్లు

**అడ్డుకున్న గ్రామస్తులు**

**నర్వ, సెప్టెంబరు 21 ప్రభాతవార్త:** నర్వ మండలంలోని లంకాల గ్రామం నుండి ఎలాంటి అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్న టిప్పర్‌లను లంకాల గ్రామస్తులు అడ్డుకున్నారు. గత రెండు రోజులుగా టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తుండడం తో ఆదివారం మట్టి తరలిస్తున్న టిప్పర్‌లను అడ్డుకోవడం జరిగిందని గ్రామస్తులు పేర్కొన్నారు. సవరయ్యకు సంబందించిన గోపాల్, సురేష్, శేఖర్‌లు మెయిన్ కెనాల్ నుంచి మట్టిని తరలించడం జరుగుతుంది అన్నారు. విషయంపై లంకాల గ్రామస్తులు నర్వ తహసీల్దార్ మల్లారెడ్డికి ఫోన్‌లో సమాచారం ఇవ్వగా ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని తహసీల్దార్ తెలిపారన్నారు. లంకల నుంచి సవరయ్య, గోపాల్, సురేష్, శేఖర్ అనే వ్యక్తిలు నా దగ్గరికి పాసు పుస్తకాలు తీసుకొని తీసుకురావడం జరిగిందని వాళ్లకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని తహసీల్దార్ గ్రామస్తులకు తెలిపారు. దీంతో గ్రామ ప్రజలు 100కు డయల్ చేయగా నర్వ పోలీస్ సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లి మట్టి కొట్టే టిప్పర్లను టిజి 12 టి 4815,టియస్ 08 యుఎఫ్ 9198, ఎపి 05 టిడి.5958 గల టిప్పర్లను నర్వ పోలీస్ స్టేషన్ కు తరలించామని, విచారణ చేసి వివరాలు త్వరలోనే వెల్లడిస్తామని అన్నారు.



మట్టి తరలిస్తున్న టిప్పర్‌ను అడ్డుకున్న గ్రామస్తులు

# రాపిడో,ఓ, ఉబర్ యాప్‌లను రద్దు చేయాలి

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 21 ప్రభాతవార్త :** ఆదివారం రోజు రైల్వే స్టేషన్ దగ్గర జిల్లా ఆటో జేఏసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఐఎన్టియుసి ఆటో యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాములు యాదవ్, రామ్మోహన్‌లు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అధికారంలోకి వచ్చిన తర్వాత రాపిడో, ఊబర్, ఓలా యాప్‌లను తీసుకువచ్చి నిరుద్యోగ యువతీ యువకుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని, మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో రోజు కు సుమారు 2000 ఆటోలు నడుస్తున్నాయని, తక్షణమే యాప్‌లను రద్దు చేయాలని, ప్రత్యేకంగా జిల్లా ఎంపీ డీకే అరుణ స్థానిక ఎమ్మెల్యేలు ప్రత్యేక చొరవ తీసుకొని యాప్లను రద్దు చేసి ,ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి , టియుసిఐ రాష్ట్ర నాయకులు సి.వెంకటేష్‌లు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ట్రాన్స్‌పోర్టు రంగంపై కనీసమైన కనికరం కూడా లేదని , ఆటో డ్రైవర్లకు ఇస్తామన్న సంవత్సరానికి 12,000 నేటికీ చెల్లించలేదని, వారికి ఉపాధి చూపించడం లేదని, ట్రాన్స్‌పోర్టు రంగంలోని కార్మికులను ప్రత్యేక వెల్ఫేర్ బోర్డు చేయాలని, ఎన్నో సంవత్సరాలుగా డిమాండ్ చేస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కనికరం చూపడం లేదని, ట్రాన్స్‌పోర్టు రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టడానికి, దానిలో భాగమే ఊబర్, ఓలా, రాపిడో అని వారు వివరించారు. మహబూబ్‌నగర్ పట్టణంలో తక్షణమే ఈ యాప్‌లను రద్దుచేసి ట్రాన్స్‌పోర్టు రంగంపైన ఆధారపడిన ఆటో డ్రైవర్లకు ఉపాధి కల్పించాలని, ఆటో అడ్డలు చూపించాలని, వారికి ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. బిఆర్ఎస్‌కేవి ఆటో యూనియన్ జిల్లా నాయకులు ఏ రాజు, నగేష్ లు మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వ అహాయములోనైనా ఆటో డ్రైవర్ల కొంత ఉపశమనం ఉన్నదని, ఉచిత బస్సుల వల్ల ఆటోల పైన ప్రజలు రవాణా చేయడం లేదని దీనివల్ల ట్రాన్స్పోర్ట్ రంగంలోని ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోతున్నారని పెరుగుతున్న ధరలు డీజిల్ పెట్రోల్ ధరలు ఇంకోవైపున ఆర్థిక భారం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తక్షణమే కార్పొరేట్ యాపులను నిషేధించాలని వారు డిమాండ్ చేశారు. ఇందులో ఐఎన్టీయూసీ ఆటో యూనియన్ జిల్లా లీడర్ బాబుమియా మాట్లాడుతూ కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చిన రూ. 12000 ఇస్తామని హామీ ఇచ్చి వాగ్దానం అమలు చేయలేదని తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేశారు. ఈ యాప్‌లు రద్దు చేయకపోతే అక్టోబర్ రెండో వారంలో జిల్లా బంద్‌కు పిలుపునిస్తామని జేఏసీ ప్రకటించింది.



మాట్లాడుతున్న యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాములు యాదవ్

# 32ద్విచక్ర వాహనాలు.. మూడు ఆటోలు స్వాధీనం

- 300ఇండ్లల్లో తనిఖీలు..
- మహబూబ్‌నగర్‌లో కార్డన్ సెర్చ్
- ప్రజల భద్రత మా బాధ్యత : డీఎస్పీ వెంకటేశ్వర్లు

(మొదటి పేజీ తరువాయి)

192 ద్విచక్ర వాహనాలు, 16 ఆటోలు, 17 కార్ల పత్రాలను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని 32 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలు స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అదనంగా 55 ఆధార్ కార్డులు గుర్తించగా, వీటిపై పత్రాల పరిశీలన కోసం తదుప రి దర్యాప్తు కొనసాగుతోందన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ వెంకటే శ్వర్లు మాట్లాడుతూ ప్రజల భద్రత కోసం పోలీసులు నిరంతరం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టడంలో ప్రతి పౌరుడి సహకారం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు.

**ప్రజలకు సూచనలు**

1. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. ఇంటి ముందర, ఇంటి లోపల, కాలనీ చౌరస్తాల్లో సీసీ కెమెరాలు ఉంటే నేర నియంత్రణ సులభం అవుతుంది.
2. దసరా పండుగ సందర్భంగా ఊర్లకు వెళ్లేటప్పుడు జాగ్రత్తలు: ఇంటికి బలమైన తాళాలు వేయాలి, కిటికీలకు పరదాలు వేసి, అవసరమైతే లైట్లు వెలిగించాలి.ఇంట్లో విలువైన వస్తువులు ఉంచరాదు.గేటుకు తాళం వేయకుండా ఉండాలి – దీని వల్ల ఇంట్లో ఎవరైనా ఉన్నారని భావిస్తారు.వెళ్లే ముందు పక్కింటి వారికి సమాచారం అందించాలి.
3. పండుగ రద్దీలో జాగ్రత్తలు:ప్రయాణ సమయంలో, బస్సుల్లో ఎక్కేటప్పుడు–దిగేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. దొంగలు బంగారం, నగదు, ఫోన్లు, పర్సులు దొంగిలించే అవకాశం ఉంటుంది.



**4.వాహన భద్రత:**

టూ వీలర్స్‌ను ఇంటి బయట కాకుండా ఇంట్లో పార్క్ చేయాలి.నాణ్యమైన లాకులు, వీల్ లాకులు అమర్చుకోవాలి. పోలీసు–ప్రజల మధ్య నమ్మకబంధం (కమ్యూనిటీ పోలీసింగ్) మరింత బలపడే విధంగా ఇలాంటి ఆపరేషన్లు కొనసాగుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ అప్పయ్య, టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఇజాజ్‌ఉద్దీన్, వుమెన్ పిఎస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్ఐలు, వన్ టౌన్, టూ టౌన్, ట్రాఫిక్ ఇతర పోలీసు సిబ్బంది.

**ప్రజలకు విజ్ఞప్తి..**

వాహనాలు వినియోగించేప్పుడు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ వంటి పత్రాలు తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలి.అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు గమనించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరుతోంది.

### దసరా సందర్భంగా హిందువులపై

# పెనుభారం మోపడం తగదు: విహెచ్‌పి

**నారాయణపేట ,సెప్టెంబర్ 21 ప్రభాతవార్త:** ఆర్టీసీ బస్సుల్లో 50 అదనపు భారం మోపడం హిందూ వ్యతిరేక చర్య అని విశ్వహిందూ పరిషత్ ఆరోప ముస్లింల పండుగలకు రాయితీలు.. హిందువుల పండుగలకు ఆర్థిక భారం దసరా పండుగకు హిందువులపై రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక భారాన్ని వేయడం తగదని విశ్వహిందూ పరిషత్ హెచ్చరించింది.దసరా పండుగ సందర్భంగా ఆర్టీసీ బస్సు చార్జీలు 50 పెంచడాన్ని విశ్వహిందూ పరిషత్ తీవ్రంగా తప్పు పడుతోంది. ఈ సందర్భంగా ఆదివారం విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు నరసింహమూర్తి, రాష్ట్ర ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి ఓ ప్రకటన విడుదల చేశారు. ఈనెల 20వ తేదీ నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు తెలంగాణ రాష్ట్రంలో విపరీతమైన బస్సు చార్జీలు పెంచి, పేద ప్రజలకు తీవ్ర ఆర్థిక భారం మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముస్లింల పండుగలకు రాయితీలు కల్పిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. హిందువుల పండుగలకు పన్నుల మీద పన్నులు వేసి తీవ్ర బారం మోపుతున్నారని ఆరోపించారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్న రేవంత్ రెడ్డి సర్కార్ వెంటనే ఈ చర్యను ఉపసహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. దసరా పండుగ సందర్భంగా పట్టణ ప్రాంతాల నుంచి పల్లెలకు.. పల్లెల నుంచి పట్టణాలకు వెళ్లే హిందువులపై ఆర్థిక భారం వేయడం క్షమించరాని నేరం అన్నారు. పండగల సందర్భంగా రాయితీలు ఇవ్వాల్సింది పోయి.. రాక్షసంగా వ్యవహరించడం ఏమాత్రం తగదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పున్నం ప్రభాకర్ గౌడ్ గారిని కలుద్దామని ప్రయత్నించినప్పటికీ అందుబాటులోకి రాలేదని తెలియజేశారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి దసరా పండగ సందర్భంగా పెంచుతున్న ఆర్టీసీ చార్జీల భారాన్ని ఉపసంహరించుకోవాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు డిమాండ్ చేశారు. లేని పక్షంలో హిందువుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ప్రభుత్వం దిగిరాకపోతే, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి హిందువులు రిటన్ గిఫ్ట్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని గుర్తు చేశారు.



పగుడాకుల బాలస్వామి

# ఊరెళ్తున్నారా.. జరభద్రం

**మొదటి పేజీ తరువాయి భాగం..**

వారికి పోలీసుల సూచనలు.ఇంట్లో బంగారు నగలు, నగదు ఉంటే వాటిని బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవడం క్షేమం. లేదాఎక్కువ రోజులు ఊళ్లకు వెళ్లేవారు విలువైన వస్తువులను వెంట తీసుకెళ్లాలి. ఊరు వెళ్తున్నప్పుడు పక్కింటి వారికి ఇంటి పరిసరాలను గమనించాలని చెప్పాలి. విలువైన వస్తువులను స్కూటర్ డిక్కీల్లో, కారులలో పెట్టడం చేయరాదు. ద్విచక్రవాహనాలు, కారులను ఇంటి ఆవరణలోనే పార్కింగ్ చేయాలి, రోడ్లపై నిలుపరాదు. బీరువా తాళాలను ఇంట్లో ఉంచరాదు, తమతోపాటే తీసుకెళ్లాలి. గ్రామాలకు వెళ్లే వారు ఇంట్లో ఏదో ఒక గదిలో లైటు వేసి ఉంచాలి. విలువైన వస్తువుల సమాచారాన్ని, వ్యక్తిగత ఆర్థిక విషయాలను ఇతరులకు చెప్పకూడదు. ఆరుబయట వాహనాలకు హ్యాండిల్ లాక్‌తో పాటు వీల్ లాక్ వేయాలి. ఇంటి తలుపులకు సెంట్రల్ లాకింగ్ సిస్టంను ఏర్పాటు చేసుకొని, వాచ్ మెన్ లేదా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం మంచిది. సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా సిసి కెమెరాలను ఇంటర్నెట్ అనుసంధానం ఉన్న మీ మొబైల్ నుంచే మీ ఇంటిని ఎక్కడి నుంచి అయినా ప్రత్యక్షంగా చూసుకునే వీలుంటుంది. ప్రజలు తమ ప్రాంతంలో గస్తీ ఏర్పాటుకు సహకరించాలి. తమ ప్రాంతం పరిధిలోని పోలీస్‌స్టేషన్ అధికారి ఫోన్ నెంబర్ ఇతర అధికారుల నెంబర్ లు ప్రజలు తమ సెల్ ఫోన్ లలో ఉంచుకోవాలి. అనుమానాస్పద, కొత్త వ్యక్తుల కదలికలపై 100 డయల్ లేదా వనపర్తి పోలీసు కంట్రోల్ రూమ్ నెంబర్ 6303923200 కులేదా పోలీసు అధికారులకు గాని సమాచారం ఇవ్వాలి.ప్రజలు పోలీసులతో సమన్వయంగా సహకరిస్తే చోరీలను నియంత్రించవచ్చని సంతోషకరమైన పండుగనుముందస్తూ జాగ్రతలతో ఎలాంటి అవాంఛనీయమైన సంఘటనలు లేకుండా వాహన ప్రయాణాలు చేస్తారు. కాబట్టి జాగ్రతలు పాటించాలని రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ జాగ్రతగా వాహనాలను నడుపుతూ ప్రశాంతంగా, క్షేమంగా తమ గమ్యస్థానాలకు చేరుకొని సంతోషంగా పండుగను జరుపుకోవాలని జిల్లా పోలీసులు కోరుకుంటున్నారు.

# ప్రజలకు న్యాయం కోసం పోరాడేదే ఎర్రజెండా

**వనపర్తి,సెప్టెంబరు21 ప్రభాతవార్త:** అణగారిన ప్రజలకు న్యాయం కోసం పోరాడేదే ఎర్రజెండా అని సిపిఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్ అన్నారు. ఆదివారం పంజాబ్ రాష్ట్రం చండీగర్లో ఈరోజు సిపిఐ 25వ జాతీయ మహాసభల ప్రారంభం సందర్భంగా వనపర్తి సిపిఐ కార్యాలయం వద్ద సిపిఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సంఘీభావ సమావేశం నిర్వహించారు. సంఘీభావం తెలుపుతూ అరుణ పతాకాన్ని జిల్లా కార్యవర్గ సభ్యురాలు మాజీ సర్పంచ్ కళావతమ్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో సిపిఐ కి వందేళ్ళ పోరాట చరిత్ర ఉందని,మరేపార్టీకి లేదన్నారు.స్వాతంత్ర్యపోరాటం,తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, ప్రత్యేక తెలంగాణ సాధన పోరాటంలో సిపిఐ కీలకపాత్ర పోషించిందన్నారు.దున్నేవాడికి భూమి,పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు, రుణమాఫీ, న్యాయమైన కూలి రైతుకు గిట్టుబాటు ధర నిరుద్యోగులకు ఉద్యోగం ఉపాధికోసం పోరాడుతూ పేదలగొంతుకగా పనిచేస్తోందన్నారు.బిజెపి అధికారంలోకి వచ్చిన 11 ఏళ్లలో పేదల కోసం చేసిందేమి లేకపోగా వారి హక్కులను హరించిందన్నారు. లేబర్ కోడ్లు తెచ్చి కార్మికులను, నల్ల సాగు చట్టాలు తెచ్చి రైతులను ఇబ్బందులు పాలు చేసిందన్నారు. ఇప్పుడు రైతులకు యూరియా ఇవ్వకుండా వేధిస్తోందన్నారు. పేదరికం నిరుద్యోగంతో ప్రజలు అల్లాడుతుంటే గుడుల పేరుతో మతం పేరుతో రాజకీయం చేస్తోందని ప్రజలు సంఘటితమై తిప్పి కొట్టాలన్నారు. వందేళ్ళపోరాట చరిత్ర కలిగిన సిపిఐ బిజెపికి వ్యతిరేకంగా పోరాడుతోందని ప్రజలు కలిసి రావాలని కోరారు. సిపిఐ 25వ జాతీయ మహాసభల స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాలకులపై పోరాటానికి సిద్ధం కావాలని కోరారు. జిల్లా కార్యవర్గ సభ్యులు కళావతమ్మ, కృష్ణవేణి, గోపాలకృష్ణ, జయమ్మ, చిన్న కుర్మయ్య, లక్ష్మీ మ్రనారాయణ, శివ, వంశీ, శిరీష,శ్రీదేవి, భూమిక, తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణమ్మకు వరద ఉధృతి

**మొదటి పేజీ తరువాయి భాగం..**

దిగువకు విడుదల చేస్తున్నారు. జలా శయం నుంచి మొత్తంగా 3,41,326క్యూసెక్కుల వరద నాగార్జున సాగర్‌కు విడుదల అవుతున్నది.జూరాలకు ఎగువన కర్ణాటకలో కురుస్తున్న వర్షాలకు ఆల్మట్టి, నారాయణపూర్ డ్యాంలకు జలకళను సంతరించుకున్నది. పాలమూరు వరప్రదాయిని జూరాలకు స్వల్పం గా వరద క్రమంగా పెరుగుతున్నది. ప్రాజెక్టుకు 2,20,000ఇన్‌ఫ్లో నమోదు కాగా, 29గేట్లు ఎత్తి దిగువకు 2,01,405క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పవర్‌హౌజ్‌కు 24,351క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.జూరాలపూర్తి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం జూరాలలో 4.786 టీఎంసీల నీటినిల్వ ఉన్నది.జూరాల ఎడమ కాలువకు 1030, కుడి కాలువకు 580క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. మొత్తంగా అవుట్‌ఫ్లో 2,28,835క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదైంది

## తొలిరోజే మాంటిస్సోరి ప్లేవే స్కూల్ ఎంగిలిపూల బతుకమ్మ



మాంటిస్సోరి ప్లే స్కూల్లో బతుకమ్మ సంబరాలు

**పెబ్బేర్, సెప్టెంబరు 21 ప్రభాతవార్త :**ఒక్కేసి..పువ్వేసి..చందమామ..ఒక్క జాములాయే చందమామ.. రామ రామ ఉయ్యాలో.. రామనే శ్రీరామ ఉయ్యాలో అంటూ మహిళల పాటలతో సద్దుల బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. పెబ్బేర్ మున్సిపాలిటీ కేంద్రంలో మాంటిస్సోరి ప్లేవే స్కూల్‌లో బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. రంగురంగుల పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలతో విద్యార్థులు కోలాటాలు, మహిళలు ఆటలు ఆడుతూ బతుకమ్మలాడారు. విద్యార్థులతో కలిసి రావణాసురుని దిష్టిబొమ్మను దహనం చేసి బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేందర్ గౌడ్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొని ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు.

## నాగిరెడ్డి అంత్యక్రియల్లో పాల్గొన్న మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి



నాగిరెడ్డి అంత్యక్రియలో పాల్గొన్న మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

**భూత్పూర్,సెప్టెంబర్ 21,ప్రభాతవార్త :** భూత్పూర్ మండలం మద్దిగట్ల గ్రామానికి చెందిన కుప్పిరెడ్డి నాగిరెడ్డి ఆదివారం మృతి చెందగా,విషయం తెల్సుకున్న భూత్పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి హుటాహుటిన మద్దిగట్ల గ్రామానికి చేరుకుని నాగిరెడ్డి పార్థివ దేహానిక పూలమాలలు వేసి ఘననివాళులర్పించి వారి కుటుంబ సభ్యుల్ని ఓదార్చారు.కుప్పిరెడ్డి నాగిరెడ్డి అంత్యక్రయల్లో పాల్గొన్నారు కేసిరెడ్డి వెంట రాంరెడ్డి,దెంది లక్ష్మీకాంత్‌రెడ్డి,తమన్నగౌడ్ ఇతర నాయకులు ఉన్నారు.

## జీవో 550 ప్రకారం కౌన్సెలింగ్ నిర్వహించాలి

- ఎంబీబీఎస్ బీడీఎస్ కౌన్సిలింగ్ లో ఎస్సీ, ఎస్టీ బీసీలకు అన్యాయం
- జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కోడుగల్ యాదయ్య డిమాండ్

**మహబూబ్‌గర్, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త:** ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన ఎంబీబీఎస్ బీడీఎస్ కౌన్సిలింగ్ లో ఎస్సీ, ఎస్టీ, బీసీ లకు అన్యాయం జరిగిందని జీవో నెంబర్ 550 ప్రకారం అడ్మిషన్లు చేపట్టాలని జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ కొడుగల్ యాదయ్య డిమాండ్ చేశారు. ఎస్సీ ఎస్టీ, బిసి విద్యార్థులకు ప్రతి ఏడాది సుమారు 300సీట్ల వరకు నష్టం జరుగుతుందని,అవి అందకుండా పోతున్నాయని, మెరిట్ వచ్చి ఓపెన్ కాంపిటీషన్‌లో వచ్చిన అభ్యర్థులను రిజర్వేషన్లు చేర్చి ఆ వర్గాలకు రావలసిన జనరల్ సీట్లను ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. విద్యార్థులకు జరుగుతున్న నష్టాన్ని ప్రభుత్వం గుర్తించే వెంటనే జీవో నెంబర్ 550 ప్రకారం సీట్ల భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

## ఎక్సైజ్ అధికారుల ఆకస్మిక తనిఖీలు

**రూ.60వేల విలువచేసే ఆల్ప్రాజోలామ్ పట్టివేత**



ఎక్సైజ్ అధికారుల అదుపులో నిందితులు

**బిజినేపల్లి,సెప్టెంబరు 21 ప్రభాతవార్త:** అల్లిపూర్ గ్రామ స్టేజీ సమీపంలో ఎక్సైజ్ శాఖ అధికారులు ఆదివారం సాయంత్రం నిర్వహించిన తనిఖీల్లో నిషేధిత మత్తు పదార్థాన్ని స్వాధీనం చేసుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా ఆబ్కారీ ఉపకమిషనర్ ఏ. విజయ్ భాస్కర్ రెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా ఆబ్కారీ అధికారి డి. గాయత్రీ ఆదేశాల మేరకు వాహనాల తనిఖీలు నిర్వహించగా, ద్విచక్ర వాహనంపై రవాణా చేస్తున్న 97 గ్రాముల ఆల్ప్రాజోలామ్ పౌడర్ స్వాధీనపరుచుకున్నారు. అల్లిపూర్ గ్రామానికి చెందిన సాంబ, మహేష్, వనపర్తి జిల్లా వీపంగండ్ల మండలం బొల్లారం గ్రామానికి చెందిన మాదాస్ వెంకటయ్య గౌడ్ రూ.60వేల విలువచేసే ఆల్ప్రాజోలామ్ తరలిస్తూ పట్టుబడినట్లు అధికారులు తెలిపారు. నిందితుల నుండి ద్విచక్ర వాహనం, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఈ తనిఖీలలో డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ సీఐ ఆర్‌వి రాజ్యలక్ష్మి ్త్ర, నాగర్‌కర్నూల్ ఎక్సైజ్ సీఐ జి.కళ్యాణ్, సిబ్బంది చిన్ననాయక్, రూఖ్య నాయ క్, రవీందర్ గౌడ్ పాల్గొన్నారు.